నమ్మలేని నిజాలు

మట్టిలో చిత్తు కాసోకాస్తో తెలివి రాపాలన.
చీపురుకట్ట పుల్లకు పుల్లతోడు కొత్త దారులు.
బీదల పొట్టు మురికితుమ్మలాట వేరుకు నిప్పు.
ఆశ అనంతం సొలగుడులో ఈగ తృప్తియే మార్గం.
మారని లంచం కుక్కతోక వంకర తెగులి తోక.

- రేడియమ్ సెల్: 9291527757



# నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

శ్రీనిజాలు

పదారు నెలల తర్వాత
మోగెను బడిగంటలు!
మొదలవునా బడిపిల్లల
మధ్యాహ్నపు వంటలు?
బడికొస్తే బిడ్డల్లా
చూస్తమండి బాగా!
కరోనొస్తె ఇంట్లోనే
చూసుకోండి జాగా!

- కందుకూరి శ్రీరాములు సెల్:9440119245



హైదరాబాద్ | గురువారం 2-9-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి:28 | సంచిక: 27 | పేజీలు:6 | వెల: రూ.1/-


## దళిత బంధు పథకం.. మరో నాలుగు మండలాల్లో అమలు

హైదరాబాద్ , సెప్టెంబర్ 1:తెలంగాణలో ప్రభుత్వం దళితబంధు పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసేందుకు సిద్ధమవుతోంది. పైలట్ ప్రాజెక్టుగా హుజూరాబాద్‌లో దళితబంధు పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్నది. ఈ నేపథ్యంలో దళితబంధు పథకం అమలు యొక్క లోతుపాతులను, దళిత ప్రజల యొక్క మనోభావాలను, వారి అవసరాలను పూర్తి స్థాయిలో అవగాహన చేసుకోవాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. ఈ క్రమంలో రాష్ట్రంలోని తూర్పు, పడమర, ఉత్తర, దక్షిణ భాగాల్లో వున్న, దళిత శాసన సభ్యులు ప్రాతినిధ్యం వహిస్తున్న నాలుగు నియోజకవర్గాల్లోని 4 మండలాలను ఎంపిక చేసి ఆ మండలాల్లో అన్ని కుటుంబాలకు దళితబంధును అమలు చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించారు.

ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలోని చింతకాని మండలం, సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం తిరుమలగిరి మండలం, నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని చారగొండ మండలం, కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గంలోని నిజాం సాగర్ మండలాలను ఎంపిక చేశారు. ఈ 4 మండలాల్లో వున్న అన్ని దళిత కుటుంబాలకు వెంటనే దళిత బంధు పథకాన్ని ప్రభుత్వం వర్తింపచేస్తుంది. సీఎం కేసీఆర్ ఢిల్లీ పర్యటన ముగించుకుని వచ్చిన తర్వాత ఆయా జిల్లాల మంత్రులు, ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు జిల్లా కలెక్టర్లతో హైదరాబాద్‌లో సమీక్షా సమావేశాన్ని సీఎం నిర్వహించనున్నారు. ఆ సమావేశంలో నిర్ణయాలు తీసుకుని ఈ నాలుగు మండలాల్లో దళితబంధు పథకాన్ని అమలు చేస్తారు.

## రైతుబంధుకు, రైతు ద్రోహికి మధ్య పోటీ : మంత్రి హరీశ్‌రావు



జమ్మికుంట, సెప్టెంబర్ 1 : హుజూరాబాద్ నియోజకవర్గంలో త్వరలో జరగబోయే ఉప ఎన్నికలో రైతుబంధుకు, రైతు ద్రోహికి మధ్య పోటీ ఉండబోతుందని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. కార్మిక బంధువులు గెలవాలా.. కార్మిక ద్రోహులు గెలవాలా మీరే ఆలోచించుకోవాలని ప్రజలకు మంత్రి సూచించారు. జమ్మికుంటలోని న్యూమార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీఐ నేత కాయిత లింగారెడ్డి, టీడీపీ నేతల అప్పాల మధు, ఏఐటీయూసీ నేత దమ్ముల రామ్మూర్తితో పాటు వందలాది మంది కార్యకర్తలు టీఆర్ఎస్ పార్టీలో చేశారు. ఈ సందర్భంగా వారందరికీ మంత్రి హరీశ్‌రావు గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

అనంతరం మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. హుజూరాబాద్‌లో టీఆర్ఎస్, బీజేపీ మధ్యే పోటీ అని స్పష్టం చేశారు. అసలు ఇక్కడ కాంగ్రెస్ ఉందా? అని ప్రశ్నించారు. కేసీఆర్ గెలిచాకా రైతుబంధు, రైతు బీమా, కాళేశ్వరం జలాలతో పాటు 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందిస్తున్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక మార్కెట్ యార్డులు రద్దు చేశారు. రైతులు ధర్నాలు చేస్తే.. రోడ్లపై మేకులు కొట్టి, రబ్బరు బుల్లెట్లతో, బాష్పవాయు గోళాలతో దాడి చేశారని మోదీ ప్రభుత్వంపై హరీశ్‌రావు మండిపడ్డారు. ఎరువుల ధరలు పెంచి, రైతులపై భారం మోపేవారు రైతు ద్రోహులు కాదా? అని ప్రశ్నించారు. మద్ధతు ధర, మార్కెట్ కావాలని కోరితే రైతుల తలలు పగులగొట్టించారు. రైతుల వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టి కరెంట్ భారం పెంచాలని చూస్తున్నారు. బీజేపీ వాళ్లు కరెంట్ లెక్కలు వేస్తుంటే.. కేసీఆర్ ఉచిత కరెంట్ ఇస్తున్నాడు. మరి మీరు ఎవరి వైపు ఉంటారో ఆలోచించుకోవాలని మంత్రి సూచించారు. బీజేపీలో చేరిన ఈటల.. మాటలన్నీ ఎర్రజెండా మాటలు మాట్లాడుతున్నాడు. ఇదెక్కడి కథ. కాషాయ జెండా చేతిలో పట్టుకుని.. ఎర్రజెండా డైలాగులు కొడితే ఎవరూ నమ్మరు. ప్రజలు అమాయకులు కారు అని హరీశ్‌రావు అన్నారు. హుజూరాబాద్‌లో ఏ అభివృద్ధి జరగాలన్నా టీఆర్ఎస్‌తో మాత్రమే సాధ్యం అని స్పష్టం చేశారు. వ్యక్తి ప్రయోజనం ముఖ్యమా? ప్రజల ప్రయోజనం ముఖ్యమా? ఆలోచించుకోవాలన్నారు. బీజేపీ గెలిస్తే ఈటల ఒక్కడికే ప్రయోజనం కలుగుతుందని హరీశ్‌రావు అన్నారు.

**పని చేసే వాళ్లు గెలవాలి**

ప్రజాస్వామ్యంలో ప్రజలు గెలవాలి. పనిచేసే వాళు గెలవాలి అని హరీశ్‌రావు పేర్కొన్నారు. 9 నెలల క్రితం దుబ్బాకలో గెలిచినాయన ఏం చేసాడు. ఆయన కూడా గెలవకముందు ఎన్నో చెప్పాడు. రైలు తెస్తా, అది తెస్తా అంటూ చెప్పిన ఆయన నోటికే మొక్కాలి? ఏవోవో చెప్పాడు. ఒక్కటీ రాలేదు. పసుపు బోర్డు తెస్తానని నిజామాబాద్ ఎంపీ బాండ్ పేపర్ రాయించి ఇచ్చాడు. రెండేళ్లైంది ఏమైంది? ప్రజల బాధను తన బాధగా భావించే వ్యక్తి కేసీఆర్.. అందుకే ప్రజల బాధలు దూరం చేసే అనేక పథకాలు తెచ్చాడు. కానీ ఈటల రాజేందర్ మాత్రం తన బాధను ప్రజల బాధగా చూపించే ప్రయత్నం చేస్తున్నాడు అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

## టీఎస్‌పీఎస్సీ కార్యదర్శిగా అనితా రామచంద్రన్ బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్ , సెప్టెంబర్ 1: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ( ఞూఖూఅ ) కార్యదర్శిగా ఐఏఎస్ అధికారి అనితా రామచంద్రన్ బాధ్యతలను స్వీకరించారు. వెయిటింగ్‌లో ఉన్న అనితా రామచంద్రన్‌ను టీఎస్‌పీఎస్సీ కార్యదర్శిగా నియమిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. టీఎస్‌పీఎస్సీ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన అనితా రామచంద్రన్‌కు టీఎస్‌పీఎస్సీ ఉద్యోగులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్‌గా అనితా రామచంద్రన్ సేవలందించిన విషయం తెలిసిందే.

## పెరిగిన కరోనా కేసులు.. నైట్ కర్ఫ్యూ విధించిన ప్రభుత్వం

గువాహటి , సెప్టెంబర్ 1:: కొవిడ్ కేసుల పెరుగుల నేపథ్యంలో అసోం ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. బుధవారం రాత్రి 9 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 5 గంటల వరకు నైట్‌కర్ఫ్యూ విధించింది. గత ఏడు రోజుల్లో 10 కరోనా కేసుల కంటే ఎక్కువగా నమోదైన ప్రాంతాలు, కంటైన్మెంట్ జోన్లలో రాత్రి కర్ఫ్యూను అమలు చేయాలని అధికారులు నిర్ణయించారు. కరోనాను కట్టడి చేసేందుకు ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, రెస్టారెంట్లు, హోటళ్లు, దాబాలు, షోరూంలు, దుకాణాలు రాత్రి 8 గంటల వరకు మూసివేయాలని సర్కారు ఆదేశించింది. అయితే అత్యవసర సేవలు 24 గంటలు కొనసాగుతాయని చెప్పింది. ప్రయాణికులు వ్యాక్సిన్ వేయించుకోవడంతోపాటు మాస్కులు తప్పనిసరిగా ధరించాలని సర్కారు సూచించింది. పోస్ట్ గ్రాడ్యుయేట్, హయ్యర్ సెకండరీ, నర్సింగ్ కోర్సులు, టెక్నికల్ ఇన్‌స్టిట్యూషన్లలో ఫిజికల్ క్లాస్‌లకు హాజరయ్యేందుకు సింగిల్ డోసు టీకా వేసుకున్న విద్యార్థులకు మాత్రమే అనుమతి ఇచ్చింది. ఇందుకు విద్యార్థులు, అద్యాపకులు, సిబ్బందికి మూడు రోజుల ముందుగానే వ్యాక్సిన్ వేయనున్నట్లు చెప్పింది. తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు సినిమా థియేటర్లు మూసిసే ఉంటాయని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇదిలా ఉండగా.. మంగళవారం అసోంలో 570 మంది వైరస్‌కు పాజిటివ్‌గా పరీక్షించగా.. ఐదుగురు మృతి చెందారు. దీంతో మొత్తం కేసుల సంఖ్య 5,89,426కు పెరిగింది.

## తెలంగాణలో 40 శాతం విద్యార్థులు స్కూళ్లకు హాజరు



హైదరాబాద్ , సెప్టెంబర్ 1:రాష్ట్రంలో స్కూళ్లు తెరుచుకోవడంతో తల్లిదండ్రులు విద్యార్థులను ధైరంగా పంపిస్తున్నారని విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 40 శాతం విద్యార్థులు పాఠశాలలకు హాజరయ్యారని తెలిపారు. బుధవారం విజయనగర్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన మంత్రి మీడియాతో మాట్లాడుతూ స్కూళ్లల్లో పారిశుధ్యం పరంగా ఎటువంటి ఇబ్బందులు లేవన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను బడులకు పంపేందుకు సంసిద్ధత వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల ప్రకారం నిబంధనలు పాటిస్తూ పాఠశాలను ప్రారంభించినట్లు చెప్పారు. గ్రామపంచాయతీ, జిహెచ్ఎంసి, మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పారిశుధ్యం శుభ్రంగా ఉందన్నారు. పిల్లల పేరెంట్స్ ధైర్యంగా పంపిస్తున్నారని చెప్పారు. డిఈవోలు, ప్రధానోపాధ్యాయులు గతంలో కన్నా ఎక్కువ జాగ్రత్తగా తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. కొవిడ్ నిభందనలు తప్పక పాటించాలని ఆదేశాలు ఇచ్చామని?ప్రార్థన సమయంలోనే జాగ్రత్తలు గుర్తు చేయాలని తెలిపారు. 60 లక్షల మంది విద్యార్థుల్లో 20 లక్షల మంది ప్రభుత్వ బడుల్లో చదువుతున్నారన్నారు. లక్ష ఇరవై వేల మంది పిల్లలు ప్రైవేట్ పాఠశాలల నుండి ప్రభుత్వ పాఠశాలకు వచ్చారని మంత్రి తెలిపారు. ఇంటర్ లో లక్షమంది వరకు ప్రభుత్వ కాలేజీలో చేరారని వివరించారు.

ఈ ఏడాది ఫస్ట్ క్లాస్‌లో అదనంగా లక్ష మంది జాయిన్ అయ్యారని మంత్రి వెల్లడించారు. మొత్తంగా ప్రభుత్వ పాఠశాలలో దాదాపు రెండున్నర లక్షల కొత్త అడ్మిషన్లు వచ్చాయన్నారు. విద్యార్థులను తమ సొంత బిడ్డలా చూసుకుంటామని మంత్రి సబితా ఇంద్రారెడ్డి భరోసా ఇచ్చారు. మధ్యాహ్న భోజన సమయంలో జాగ్రత్తలు ఎక్కువగా తీసుకోవాలని, డిఈవోలు, ఎంఈఓ, ప్రధానోపాధ్యాయులు ప్రత్యేకమైన శ్రద్ధ వహించాలని ఆదేశించారు. పేరెంట్స్ నమ్మకాన్ని నిలబెట్టేలా అధికారులందరూ వ్యవహరించాలని సూచించారు. రెసిడెన్షియల్ తప్ప మిగతా పాఠశాలలను ప్రారంభమైనట్లు మంత్రి సబితా చెప్పారు.

కాగా, రాష్ట్ర వ్యాప్తంగా స్కూళ్లు, కాలేజీల్లో ప్రత్యక్ష తరగతులు ప్రారంభమయ్యాయి. కరోనా జాగ్రత్తలు పాటిస్తూ మాస్కులు ధరించి విద్యార్థులు పాఠశాలలకు హాజరయ్యారు. భౌతిక తరగతులకు ముందే సిబ్బందని స్కూళ్లను శుభ్రం చేయించారు. కొవిడ్ నిబంధనలు పాటిస్తూ ప్రత్యక్ష తరగతులను నిర్వహిస్తున్నారు. విద్యార్థుల శరీర ఉష్ణోగ్రతలు పరిశీలించిన తర్వాతే తరగతులకు అనుమతించారు.

## పిల్లలను ధైర్యంగా బడికి పంపాలి : డీహెచ్ శ్రీనివాసరావు

హైదరాబాద్ , సెప్టెంబర్ 1: తల్లిదండ్రులు తమ పిల్లలను ధైర్యంగా బడికి పంపాలని వైద్య, ఆరోగ్య సంచాలకులు డాక్టర్ శ్రీనివాసరావు సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎనిమిది నెలల తర్వాత పాఠశాలలు ప్రారంభమా య్యాయన్నారు. కరోనా నేపథ్యంలో విద్యార్థుల తల్లిదండ్రుల్లో భయాలున్నాయని, తొలి రోజు తక్కువ మంది విద్యార్థులు పాఠశాలలకు వచ్చారన్నారు. కొవిడ్, సీజనల్ వ్యాధుల లక్షణాలుంటే పిల్లలను బడికి పంపొద్దని కోరారు. 95శాతం మంది పాఠశాల సిబ్బందికి వ్యాక్సినేషన్ పూర్తయినట్లు చెప్పారు.

టీకా తీసుకున్న సిబ్బందికే పాఠశాలల్లోకి అనుమతి ఇస్తున్నట్లు స్పష్టం చేశారు. పాఠశాలలో మాస్క్, తరచూ శానిటైజర్ వాడాలని కోరారు. థర్డ్ వేవ్‌పై శాస్త్రీయ ఆధారాలు లేవని తెలిపారు. కొత్త రకం స్ట్రెయిన్ వస్తే తప్ప మూడో వేవ్‌కు అవకాశం లేదన్నారు. థర్డ్ వేవ్ వచ్చినా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సన్నద్ధంగా ఉందన్నారు. కొవిడ్‌తో విద్యా వ్యవస్థ దెబ్బతిన్నదని, పిల్లల్లో విద్యపై ఆసక్తి తగ్గుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లలు ఫోన్లకు బానిసలవుతున్నారనీ, పిల్లల మానసిక స్థితిని దృష్టిలో ఉంచుకొని పాఠశాలలు తెరిచినట్లు వెల్లడించారు. తల్లిదండ్రులు పిల్లలను ధైర్యంగా పిల్లలను స్కూల్స్‌కు పంపాలన్నారు. 1-10 ఏళ్ల లోపు వారిలో కేవలం 3శాతం మాత్రమే కొవిడ్ బారిన పడ్డారని, 20 ఏళ్లల్లో వారిలో 13శాతం మందికి కొవిడ్ సోకిందన్నారు. పిల్లలకు కొవిడ్ సోకినా 100 శాతం కోలుకుంటున్నారని వివరించారు. సీరో సర్వే ప్రకారం పెద్దల్లో 63శాతం యాంటీబాడీలున్నాయని తెలిపారు. బోనాలు వంటి వేడుకలు జరిగినా రాష్ట్రంలో కరోనా కేసులు పెరుగులేదని, పరిస్థితి అదుపులోనే ఉందని పేర్కొన్నారు. ఈ నెలలో 50లక్షల కొవిడ్ టీకాలు ఇవ్వాలని ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. 12 సంవత్సరాలు నిండిన పిల్లలకు టీకా ఈ నెలలో వచ్చే అవకాశం ఉందని శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. రెండు సంవత్సరాలు నిండిన పిల్లల కోసం భారత్ బయోటెక్ వ్యాక్సిన్ అభివృద్ధి చేస్తోందని తెలిపారు. ఈ టీకా రెండు నెలల్లో అందుబాటు లోకి వచ్చే అవకాశం ఉందని చెప్పారు.

## 'అర్థ్ నీతి' నివేదిక రాష్ట్ర ప్రగతికి నిదర్శనం : వినోద్ కుమార్

హైదరాబాద్ , సెప్టెంబర్ 1: తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో సాధించిన ప్రగతిని కేంద్ర ప్రభుత్వ నీతి ఆయోగ్ సంస్థ మంగళవారం విడుదల చేసిన అర్థ్ నీతి నివేదికలో ప్రతిబింబింప చేసిందని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన ఉన్న నీతి ఆయోగ్ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిపై ప్రశంసల జల్లు కురిపించిందని ఆయన తెలిపారు. కొత్తగా ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్రం ఏడేళ్ళ కాలంలో అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో దేశంలోనే గొప్ప రాష్ట్రంగా నిలిచిందని నీతి ఆయోగ్ పేర్కొన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

**వాస్తవాలు గ్రహించాలి**

బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్, టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి ఇప్పటికైనా వాస్తవాలు గ్రహించాలని వినోద్ కుమార్ సూచించారు. కళ్ళుండి కబోదిగా వ్యవహరించవద్దని, ప్రజలకు వాస్తవాలు చెప్పాలని ఆయన పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో తెలంగాణ రాష్ట్రం శరవేగంగా దూసుకెళ్తోందని, అందుకు నీతి ఆయోగ్ అర్థ్ నీతి నివేదికే తార్కాణమని ఆయన చెప్పారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు రాజకీయంగా విమర్శలు చేయడం మానుకొని, వాస్తవాలను గ్రహించి మెలగాలని వినోద్ కుమార్ హితవు చెప్పారు.

ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని, ఆ ప్రగతి ఫలితమే నీతి ఆయోగ్ నివేదికలో ప్రస్ఫుటమైందని ఆయన వివరించారు. రాష్ట్ర జీఎస్‌డీపీ 2014-15 ఆర్థిక సంవత్సరంలో రూ. 5,05,849 కోట్లు ఉండగా, 2020-21లో రూ. 9,80,407 కోట్లకు చేరుకుందని, ఇది 94% శాతం పెరిగిందని వినోద్ కుమార్ తెలిపారు.

రాష్ట్ర వార్షిక వృద్ధి 2015-16 నుంచి ఇప్పటి వరకు 11.7% శాతం కంటే ఎన్నడూ తగ్గలేదని ఆయన అన్నారు. వ్యవసాయ రంగంలో 54% శాతం మంది పాలుపంచుకుంటున్నారని, రాష్ట్ర ఆవిర్భావం సందర్భంగా 2% శాతం ఉన్న వ్యవసాయం ప్రస్తుతం 16.5% శాతానికి పెరిగిందని వినోద్ కుమార్ వివరిం చారు. సీఎం కేసీఆర్ విజన్ తో కాళేశ్వరం, మిడ్ మానేరు వంటి పలు ప్రాజెక్టుల వల్ల ఇది సాధ్యమైందని అన్నారు. నీటి పారుదల రంగంలో గణనీయమైన ప్రగతితో వ్యవసాయం పెరిగిందని వినోద్ కుమార్ తెలిపారు. పర్ క్యాపిటా ( తలసరి ) ఆదాయం దాదాపు రెండింతలు అయిందని ఆయన అన్నారు. 2014-15లో పర్ క్యాపిటా ఆదాయం రూ. 1,24,104 లక్షలు ఉండగా 2020- 21 లో అది రూ. 2,37, 632 లక్షలకు పెరిగిందని తెలిపారు. ఇలా అనేక రంగాల్లో తెలంగాణ రాష్ట్రం ప్రగతి పథంలో దూసుకుని ముందుకు సాగుతోందని వినోద్ కుమార్ పేర్కొన్నారు.




ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ సౌజన్యంతో శ్రీ శ్రీ కళావేదిక ఆధ్వర్యంలో శుక్రవారం పశ్చిమగోదావరిలోని ఏలూరులోని వైఎహెచ్ఎ ప్రాంగణంలో జరిగిన ఒక కార్యక్రమంలో సాహిత్యరత్న అయ్యలసోమయాజుల ప్రసాద్ (రసాయనశాస్త్ర విశ్రాంత శాఖాధిపతి విశాఖపట్నం) జాతీయ కవిసమ్మేళనంలో పాల్గొని కవితా గానం చేసినందుకు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ చైర్ పర్సన్ పిల్లం గోళ్ళ శ్రీ లక్ష్మి మరియు శ్రీ శ్రీ కళా వేదిక వ్యవస్థాపకులు శ్రీ కత్తిమండ ప్రతాప్ గారు, గుఱ్ఱం జాషువ పురస్కార గ్రహీతల చేతుల మీదుగా 'శ్రీశ్రీ ప్రతిభా పురస్కారం' స్వీకరిస్తున్న దృశ్యం.




నిజామాబాద్‌లో ఆగష్టు 31న మంగళవారంరోజు నవయువకవి క్రాంతికుమార్ రచించిన 'అంతర్మథనం' పుస్తకావిష్కరణ సభలో ప్రసంగిస్తున్న ఆవిష్కర్త డా॥ నాళేశ్వరం శంకరం. వేదికపై డా॥ కాసర్ల నరేశ్‌రావు, రాజేశ్వర్, డా॥ వి. త్రివేణి, వి.శంకర్, డా॥ బోయినపల్లి ప్రభాకర్, వి.పి.చందన్‌రావు, ఘనపురం దేవేందర్, నరాల సుధాకర్, డా॥పింగళి గంగాధర్‌రావు, డా॥మద్దుకూరి సాయిబాబా.




ముద్దు ముద్దుగా యశోద
ముచ్చటలన్నీ తీర్చిన
చిన్ని కృష్ణునీ అల్లరి
చిలిపి చేష్టలకు మురిసిన

తల్లులంత ఈ నాటికి
తమ తమ పిల్లల కెల్లను
తరతరాలుగా ప్రియముగ
తనివిదీర వెన్నదొంగ
వేషాలను వేయిస్తూ
వేడుకగా తిలకిస్తూ
తన్మయత్వమును పొందుచు
'జన్మాష్టమి' జరుపుకునే
సంప్రదాయమే నిలిచెను
సంబరాల మైమరిచెను!

- డా॥ వడ్డేపల్లి కృష్ణ
9246541699



### చరిత్రలో నేటినిజం



( సెప్టెంబర్ 2 గాయని అనురాధ పుట్టిన రోజు..)

- రాధశ్రీ
సెల్: 9494481210



### నిప్పురవ్వలు



కన్నీటిని
విశ్లేషించకు
అన్నీ "కష్టాలే"
చిరునవ్వును
ఆవిష్కరించు
అన్నీ "ఆనందభాష్పాలే!!



శత్రువును
ఛేదించడానికి
అస్త్రాలు లేవు
అక్షరాలు తప్ప-
మిత్రులను
ప్రేమించడానికి
లక్షలు లేవు
ప్రేమ సాక్ష్యాలు తప్ప!



శరీరం
రక్తమాంసాలున్న
పరీక్ష నాళిక అయితే
నిరంతర
రసాయన చర్యే
ఆలోచన!



భగవద్గీత
యుద్ధానికి
సన్నద్ధం చేయడానికి!
మారణ హోమం!
శాంతిని
స్థాపించడానికి?



నాల్గవ గోడ
లేకున్నా
నాటకం-
ముగ్గురున్న
గది
ఇరకాటం!

- డా॥ విప్లవ్‌దత్ శుక్లా
సెల్:9849185878



### జగతః పితరౌ వందే!





నేటినిజం
# సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 2-9-2021


-శ్రీదాస్యం లక్ష్మయ్య
అడ్మిన్, నేటికవిత
9440155240

## నేటికవిత-కవిత్వ విశ్లేషణ

నేటికవితలో ఈ వారం: 'స్వప్న కుసుమాలు' అనే అంశంపై వచ్చిన కవితల్లోంచి ఓ మూడు ఎంపికయిన కవితలపై విశ్లేషణ


-దాస్యం సేనాధిపతి
కవిత్వ విశ్లేషకులు
9440525544

### స్వప్నసుమాలు ....

వేల వేల భావాలు నిండిన నక్షత్ర లోకంలో
ధృవతారలా ఓ సుందర హృదయం
స్వప్నమై తట్టింది
సుషుప్తావస్థలోనూ
స్వాగత మంజీరాలు వినిపిస్తుంటే
మస్తిష్కపు పొరల్లో మానవీయ కదలికకు
సుగమమం చేసేందుకు కదిలిందా హృదయం...
నిరాశల వలయాన్ని నిర్భయంగా దాటిస్తూ
సొలసిన కన్నులకు సాంత్వననిస్తూ
అలసిపోతున్న ఆశలకు ఆయువుపోస్తూ
బీడవుతున్న భూమిని తాకే ఓదార్పు చినుకవుతూ
భీతిల్లిన జీవన సంద్రానికి ఎదురీత నేర్పుతూ
దయలేని ప్రపంచాన్ని గెలిచే మార్గమవుతూ
స్వప్నంలో మెరిసిన హృదయం దారిచూపింది!
ఉబికే కన్నీటి కలాన్ని అందించి కవిగా మారుస్తూ
విషాద గీతాన్ని వినూత్న కావ్యంగా మలుస్తూ
తోడుగా మదిలో కొలువుంది
కనులు తెరిస్తే కరిగిపోతుందేమో
మనసున దాచేస్తే నిలిచిపోతుందేమో
నాకు ప్రేరణనిచ్చి కాంతిపంచిన
ఆ స్వప్నలోకం ధృవతార
పుడమితల్లి విత్తును దోచినట్లు
కడదాకా దాచుకుంటా ఈ స్వప్నకుసుమాన్ని
కవితగా చేసుకుంటా అక్షరమాలల్లి!!


-జూపూడి సుధారాణి
8341524905

కృష్ణా జిల్లా బంటుమిల్లికి చెందిన కవయిత్రి జూపూడి సుధారాణిగారు స్వప్నకుసుమాలు అంశంపై స్వప్నకుసుమాలు శీర్షికతో రాసిన కవిత ఆద్యంతం ఆసక్తికరంగా మలచబడింది. మస్తిష్కపు పొరల్లో మానవీయ కదలికల మార్గం సుగమం చేసేందుకు కదిలిన హృదయంలోని భావాలను అందంగా ఆవిష్కరించడంలో కవయిత్రి సుధారాణి గారు సఫలీకృతులైనారు. సృజనలోకంలో కవిత్వరచనలో తరిస్తున్న కవయిత్రి ఎత్తుగడలో వేల వేల భావాలు నిండిన నక్షత్ర లోకంలో ధృవతారలా ఓ సుందర హృదయం స్వప్నమై తట్టిందనీ.. సుషుప్తావస్థలోనూ స్వాగత మంజీరాలు వినిపిస్తుంటే కవితలుగా రూపుదిద్దుకున్న అనుభూతులను అక్షరాల్లో బంధించారు.

నిరాశల వలయాన్ని నిర్భయంగా దాటిస్తూ సొలసిన కన్నులకు సాంత్వననిస్తూ అలసి పోతున్న ఆశలకు ఆయువు పోస్తూ బీడవుతున్న భూమిని తాకే ఓదార్పు చినుకవుతూ భీతిల్లిన జీవన సంద్రానికి ఎదురీత నేర్పుతూ దయలేని ప్రపంచాన్ని గెలిచే మార్గమవుతూ స్వప్నంలో మెరిసిన హృదయం దారి చూపిందని చెప్పడం బాగుంది. స్వప్న సుమాలను అక్షర కుసుమాలుగా అల్లడానికి దారిచూపే హృదయాన్ని ప్రస్తావించిన తీరు బాగుంది.

కవయిత్రి సుధారాణి గారు కవయిత్రిగా సాగిస్తున్న సాహితీయానంలోని అనుభవాలను.. అనుభూతులను.. సంఘర్షణలను. ఔచిత్యవంతంగా కవితలో ఆవిష్కరించేందుకు ప్రయత్నించారు. నాకు ప్రేరణనిచ్చి కాంతి పంచిన స్వప్నలోకపు ధృవతార ఉబికే కన్నీటికి కలాన్ని అందించి కవిగా మారుస్తూ విషాదగీతాన్ని వినూత్న కావ్యంగా మలుస్తూ తోడుగా మదిలో కొలువుందనీ.. కనులు తెరిస్తే కరిగి పోతుందేమోననీ.. ప్రకటించడం బాగుంది.

కవయిత్రి సుధారాణిగారు అంశం వెలుగులో విభిన్నమైన కోణంలో తమ భావాలను పొందుపరిచారు. పుడమితల్లి విత్తును దాచినట్లు.. మేఘాలు చినుకు ముత్యాలను దోచినట్లు.. కడదాకా ఈ స్వప్న సుమాన్ని దాచుకుంటానంటూ కొనసాగించారు. అంతేగాక స్వప్న కుసుమాలను అక్షర మాలలుగా అల్లి కవితగా వేసుకుంటానని మంచి ముగింపునిచ్చారు. హృదయంలో కదలాడే భావాలను.. స్వప్నంలో విరబూసే కుసుమాలను అందంగా అక్షరాల హారంగా మలుస్తానని ప్రకటించడం ప్రశంసనీయం. మున్ముందు కవయిత్రి సుధారాణి గారు మరింత గాఢమైన కవిత్వం పండిస్తారన్న విశ్వాసం ఉంది.

### ఫలించాలని...

ఆకాశమున రేరాజు
వెలుగుపూలు పండిస్తూ
కనుల కమలాల మాటున
కమ్మని కలల్ని ఆహ్వానిస్తున్నాడు.
మత్తు విడిచిన దేహం
ఒళ్ళు విరుచుకుంటే
పురివిప్పిన మది
నాట్యమాడుతోంది
కొత్తస్ఫూర్తితో..
రోజుకో ఆశతో
కొంగొత్త ఊసులతో
వూహలకు రెక్కలు తొడిగి
ఉవ్వెత్తున ఎగిసిపడే
ఎదలయకు కారణమేమో
ఇన్నాళ్ల కాలయాపనకు
తెరపడబోతోందనే
చిద్విలాసం చిందిస్తోంది
చిన్ని మనసు
పొత్తపు తనువును మనసారా
పునికి చూడాలని
మెత్తని హస్తముల కలానికి
కళలు నేర్పాలని
బడి ఒడిన ఓలలాడాలని
తప్పిపోయిన మార్గాన్ని
బుడిబుడి అడుగుల అన్వేషిస్తూ..
ప్రత్యక్ష చదువుల కోసం
ఉవ్విళ్లూరుతోంది పసి హృదయం..
కోరుకుందాం అందరం
కలవరింతలను తలపిస్తూ
వికసించిన
స్వప్నకుసుమాలు ఫలించాలని
చింతలేక చిన్నిహృదయం
హాయిగా పవ్వళించాలని..


-ఆది విజయలక్ష్మి శ్రీనివాస్
9959935647

కరీంనగర్ కు చెందిన కవయిత్రి ఆది విజయలక్ష్మి శ్రీనివాస్ గారు స్వప్నకుసుమాలు అంశంపై ఫలించాలని... శీర్షికతో రాసిన కవితలో.. ఏ విధమగు చింతలు లేక చిన్ని హృదయం హాయిగా పవళించాలని.. పిల్లలతో పాటు అందరిజీవితం ఆనందమయంగా కొనసాగాలన్న అర్థం ధ్వనించేలా తమ భావాలను అక్షరీకరించారు.

ఎత్తుగడలో కవయిత్రి విజయలక్ష్మి గారు ఆకాశాన రేరాజు వెలుగులు పండిస్తున్నాడనీ..కనుల కమలాల మాటున కమ్మని కలల్ని ఆహ్వానిస్తున్నాడని చెప్పడం బాగుంది. కనుల కమలాల మాటున పదబంధ ప్రయోగం చేసి కవితకు శోభను కూర్చారు.

మత్తువిడిచిన దేహం ఒళ్లు విరుచుకుంటుంటే.. పురివిప్పిన మది అని ప్రకటించడం కవయిత్రి యొక్క కలం బలాన్ని సూచిస్తోంది. రోజుకో ఆశతో కొంగొత్త ఊసులతో ఊహలకు రెక్కలు తొడిగి.. ఉవ్వెత్తున ఎగిసిపడే ఎదలయకు కారణమేమో.. ఇన్నాళ్ల కాలయాపనకు తెరపడబోనుందనే చిద్విలాసం చిందిస్తోంది చిన్నిమనసు అంటూ .. చిన్ని మనసు చిద్విలాసాలను అందంగా అక్షరాల్లో నిక్షిప్తం చేశారు.

పొత్తపు తనువును మనసారా వీక్షించాలనీ.. మెత్తని హస్తముల కలానికి కళలు నేర్పాలనీ.. బడి ఒడిన ఓలలాడాలనీ..తప్పిపోయిన మార్గాన్ని బుడిబుడి అడుగుల అన్వేషిస్తూ .. ప్రత్యక్ష చదువులకోసం ఉవ్విళ్లూరుతోంది పసి హృదయం అంటూ.. ప్రస్తుత కరోనా నేపథ్యంలో .. చిన్నారుల బడి చదువులకు దూరమై ఇంటికే పరిమితమైన సంఘటనలను దృష్టియందుంచుకొని కవయిత్రి పసి హృదయాల ఆకాంక్షను అక్షరబద్ధం చేశారు. ప్రత్యక్ష చదువులకోసం . చిన్నారులు తల్లడిల్లుతున్న విషయాన్ని ప్రస్తావించారు.

కవయిత్రి కాంక్షించినట్లు అందరం కలవరింతలను తలపిస్తూ . వికసించిన స్వప్నకుసుమాలు ఫలించాలనీ కోరుకుందాం. చింతలు లేని చిన్ని హృదయం సాంత్వన పొందాలన్న ఆకాంక్షతో కవయిత్రి విజయలక్ష్మిగారు రాసిన కవితలో ఆద్యంతం ప్రస్తుత పరిస్థితులను ప్రస్తావిస్తూ పరిస్తితులు మారి సంతోషాలకు తెరలేపే కరోనారహిత వాతావరణాన్ని కోరుకుంటూ రాశారు. ఆశావహదృక్పథంతో రాసిన కవయిత్రి ఆకాంక్ష ఫలించాలనీ... అధ్యయనంపై దృష్టిపెట్టి కవయిత్రి గారు తమ కలానికి మరింత పదును పెట్టుకోవాలని ఆశిద్దాం.

### స్వప్న కుసుమాలు

ఏ నీరెండలో పూసే పూలు కావవి
ఆ వానచినుకులకు చిగురించవు
ఈ స్వప్నకుసుమాలు.
మది దోసిలిలో ఒడిసిపట్టిన
ఒక్కోచుక్క నిబ్బరపు నీళ్లే
ఆశావహదృక్పథ అంకురాన్ని
చిగురింపజేసే పన్నీరుకు
పూసేను ఈ స్వప్న కుసుమాలు.
కాలపుటంచున వాలిపోయే
చేదు ఆకుల వాస్తవాన్ని
మరిచే మధురభావాల
మరపునీడన విరిసేను
ఈ వేకువకలలపూలు
ఎద కాన్వాసులో
హరివిల్లు చిత్రిస్తేనే
స్వప్నతీరంలోని కుసుమాలు
పరిమళిస్తాయి జీవితాన్ని
సుగంధ భరితం చేస్తాయి


-దార స్నేహలత
9849929226

గోదావరిఖనికి చెందిన కవయిత్రి దార స్నేహలత గారు స్వప్నకుసుమాలు అంశంపై 'స్వప్నకుసుమాలు' శీర్షికతో రాసిన కవితలో చక్కని భావుకతను ప్రదర్శించారు. ఆశావహ దృక్పథంలో అంశం వెలుగులో కవయిత్రి ప్రకటించిన భావాలు బాగున్నాయి. ఎత్తుగడలో .. ఏ నీరెండలో పూసే పూలుకావవీ.. వాన చినుకులకు చిగురించవు ఈ స్వప్నకుసుమాలు అంటూ కవిత పట్ల పాఠకుల్లో ఆసక్తిని పెంచారు.

ఆశావహదృక్పథ అంకురాన్ని చిగురింపజేసే పన్నీరుకు ఈ స్వప్నకుసుమాలు పూసాయని పేర్కొనడం బాగుంది. మది దోసిలిలో ఒడిసి పట్టిన ఒక్కోచుక్క నిబ్బరపు నీళ్ళే ఈ స్వప్నకుసుమాలకు ఆలంబన అయినాయన్న అర్థం వచ్చేలా కొనసాగించారు.

మది దోసిలిలో ఒడిసిపట్టిన ఒక్కోచుక్క నిబ్బరపు నీళ్లు అంటూ ప్రయోగించిన పదబంధాలు కవితలో చక్కగా ఒదిగిపోయాయి. అలతి అలతి పదాలతో నర్మగర్భంగా బలమైన భావాలను ప్రకటించడానికి కవయిత్రి స్నేహలత గారు చేసిన కృషి అభినందనీయం.

సరళత్వానికి పెద్దపీట వేస్తూ.. పదాడంబరాలకు చోటివ్వకుండా అంశాన్ని విశ్లేషించే ప్రయత్నం చేశారు. కాలపుటంచున రాలిపోయే చేదు ఆకుల వాస్తవాన్ని మరిచే మధుర భావాల మరపునీన విరిసేను ఈ వేకువ కలల పూలు అంటూ రాసిన పంక్తులు కవితకు పుష్టినిచ్చాయి. స్వప్నంలో వికసించే కుసుమాలను రమణీయ భావాల సమాహారంగా తీర్చిదిద్దేందుకు కవయిత్రి స్నేహలత గారు చేసిన ప్రయత్నం ప్రశంసనీయం...

కవిత ఆరంభంలో ఎత్తుగడలోనే కవయిత్రి పేర్కొన్నట్లు.. స్వప్నంలో విరబూసే కుసుమాలు.. నీరెండలో పూసే పూలు కావని చెప్పడంలో ఆమె ఔచిత్యాన్ని మనం గ్రహించవచ్చు. ఎదకాన్వాసులో అందమైన ఆలోచనల హరివిల్లు చిత్రిస్తేనే.. స్వప్న తీరంలోని కుసుమాలు పరిమళిస్తాయని. జీవితాన్ని సుగంధభరితం చేస్తాయని చెప్పడం బాగుంది. కవిత్వ సృజనలో మరిన్ని మెలకువలు తెలుసుకొని .. మున్ముందు మరింత గాఢమైన కవిత్వం స్నేహలత గారి కలం నుండి జాలువారాలని ఆశిద్దాం.

### నానీలు

లక్ష్యం
నీ ఆయుధమా
ఏ మర ఫిరంగులూ
నిన్ను ఆపలేవు మరి!

సానపడితేనే
ఇనుముకు పదును
కష్టాలోర్చితేనే
జీవితానికి అదును

పొలంలో
నాట్లు వేస్తున్నారు
మట్టి చేసే
మహాయజ్ఞానికి శ్రీకారం


-వడ్డేపల్లి సంధ్య
సెల్:7036000123

### బుడతడు

చెరో వైపు
రెండు కర్రల్ని పాతి
ఆకాశంలో వాడి నడక
భుజంమీద బుడతడొకడు
గోడమీద బల్లిలా వేలాడుతూ..

కాళ్ళక్రింద
త్రొక్కి పెట్టిన తాడు
విలవిల లాడ్తుంటుంది.
తూలకుండా, క్రిందికి వాలకుండా
చేతుల్లో ఓ కర్ర ఊతగా..

ఆ కొసను చేరాలి
బతుకు నావను తీరం చేర్చాలి.

వాడి ఆలి కాబోలు
నేలమీద కూర్చుని డప్పువాయిస్తు
తలపైకెత్తి.. తన చూపుల్ని
వాడి పాదాలను రక్షగా
అతికిస్తుంది.

నేలమీద
కేకలు, అరుపులు, ఈలలు
వాడి చెవుల్ని చేరవు
గాల్లో ఎగిరే నాణేలు
పదీ. పరకా
వాడి ఏకగ్రతముందు
తోక ముడుస్తాయి.

లక్ష్య సాధనకు
కళ్ళు తెరిచి తపస్సు చేస్తుంటాడు.

ఒక్కో అడుగూ ముందుకు వేస్తు
ఆ కొసను చేరగానే
ఆకలిని జయించిన ఆనందం
ఆ బుడతడిది.

మళ్ళీ అటునడుస్తాను
నమ్మకమేనా?
అరుస్తాడు వాడు.

నేల మీది ఆవేశం
కట్ట తెంచుకుంటుంది
నడు. నడూ అంటు
అరుపులు ఆకాశాన్నంటుతాయి.

బుడతడితో సహా..
నమ్మకమేనా?
మళ్ళీ అడుగుతాడు వాడు.

అవును..అవును. అంటూ
ముక్త కంఠం ధ్వనిస్తుంది
అయితే..
రెండో భుజంమీద మోస్తాను
మీ బుడతడొకడ్ని అందించండి..
వాడి మాటలు పూర్తి కాలేదు
శబ్దం స్తంభించింది
నమ్మకం పారిపోయింది.


- రమణ వెలమకన్ని
సెల్: 9866015040

### తమన్నా

అల్లావుద్దీన్ అద్భుత దీపం కథల్ని
మళ్ళీ ఓసారి వినాలని వుంది.
మొద్దు బారిన కుతూహలాన్ని
ముద్దు చెయ్యాలని వుంది.

మొట్ట మొదటిసారి
ఇంద్రధనుస్సు కంట పడ్డప్పుడు
విస్ఫారిత నయనాల్లోని
విస్మయాన్ని రికార్డు చెయ్యాలని వుంది.

ఇప్పుడు కూడా మిత్రుల్తో
ఆట లాడాలని వుంది.
కాని వాటి లోంచి
జయాపజయాలను
తొలగించాలని వుంది.

రాత్రి పూట
అరచేతిలో వాలిన
మిణుగురులను చూస్తూ
చిట్టి చిట్టి రత్నాలతో
చిందెయ్యాలని వుంది.

అర్థం పర్థం లేకుండా
హాయిగా నవ్వాలని వుంది.
స్వచ్ఛాతి స్వచ్ఛమైన నవ్వు
హాస్య రహితమై
విరిసిన పువ్వు,
సీతాకోకచిలుకల వెంట
పరుగులు తీస్తూ
నన్నే ఓ పుష్పంగా
భావించుకోవాలని వుంది.

మ్యాజిక్ చేస్తూ
నోటి లోంచి రిబ్బెన్ లాగినట్టు
పాటలు పాడాలని వుంది.

చిన్నతనం నుంచీ
ధ్వన్యనుకరణ నా కిష్టం!
వేణుమాధవ్‌ను
మళ్ళీ బతికించుకోవాలని వుంది.

మెల్ల మెల్లగా
ముదురు కవిత్వం మానేసి
బాల సాహిత్యం
రాయాలని వుంది.


-డా|| ఎన్. గోపి
సెల్:9391028496

### భల్లం భాష్యం

## కవిత్వం కమనీయమే కాదు మహనీయం కూడా....

కొంత మంది కవుల ఆశయం పట్ల ఉన్నంత ఆవేశం కవితా రచనపట్ల ప్రదర్శితం కావటం లేదు. కవితా రచనకు కావలసిన దీక్షా, నిగ్రహం, సృజనలో పరిణతి చెందడం లేదనిపిస్తుంది.

ఆధునిక కవిత్వంలో- రూపంలోనూ, వస్తువలోనూ భాషలోనూ, భావ ప్రకటనంలోనూ అనేక నూతన ధోరణులు వికసించడానికీ, సంకోచాలు తొలగిపోయి ఆయా ప్రజా శ్రేణులు స్వేచ్ఛగా కొంతమంది కవులు తమ అనుభూతులను, అనుభవాలను ప్రకటించడానికీ మార్గనిర్దేశం చేస్తుంటారు.

ఈ మధ్యకాలంలో శుద్ధ వచనంతో కవిత్వం వెలువడుతున్నది తప్ప, కవిత్వంలో లలితత్వ సృజనతగ్గి పోతుందని కొందరు అతిగా భావిస్తున్నారు. కవితా నిర్మాణంలో భావ చిత్రాలు మిళితం చేస్తూ.. పద బంధాలు గుప్పిస్తూ, ఎంచుకున్న వస్తువును రసమయం చేయడం, అభివ్యక్తిలోని పరిణతి కొత్తగా వ్యక్తీకరిస్తూ తనదైన శైలితో మంచి కవిత్వాన్ని రాస్తామని వాగ్దానం చేస్తున్న నవకవులను ఈమధ్య గమనిస్తున్నాం.

మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని, మనుషుల్లో.. అంతర్గత సంఘర్షణలను, ప్రవర్తనా తీరులను తరాల అంతరాలను అవగాహన వైనాలను కవిత్వంలో చక్కగా ప్రతిబింబించడమే కాదు. కవిత్వంలో మానవత్వ పరిమళం నింపగల సత్తావున్న కవులెందరో వున్నారు.

కవిత్వం నవనవోన్మేషంగా ఉండడం, ప్రయోగాలు చేయడం ఒక్కోసారి అవసరమే. అయితే వస్తుబలం లేనప్పుడు, ప్రతీకల ప్రభ వెలగనప్పుడు- ఇవన్నీ తేలిపోతాయి. ఆ వస్తువు సమాజంలోంచి వచ్చినప్పుడు, ఇటువంటి ప్రయోగాలు రాణిస్తాయి. లేదా అస్పష్టతా దోషానికి గురవుతాయి.

కవిత్వంలో తేలికైన భాషలో తక్కువ మాటల్లో పదచిత్రాల ద్వారా భావ స్ఫూర్తిని కల్గించాలి. అతి సామాన్యంగా కనిపించే దృశ్యాలలో తాత్త్విక రహస్యాల్ని దర్శింపచేస్తూ, ఆ మార్గంలో తమ తమ వ్యక్తిత్వాలన్ని పాఠక, హృదయాల్లో ప్రదర్శించాలి.

సాధారణంగా ఒక దృశ్యమో, సంఘటనో సందర్భమో సృజనకారుడి కలం నుండి కవిత్వమై మెరుస్తుంది. ఇదేమీ లేకుండా ఓ అలౌకికానుభూతికి లోనయి ఊహలకు రెక్కలు తొడిగి పారవశ్యంతో పలవరించి- భావ కవిత్వాన్ని తలపించే కవిత్వం కూడా కవితా ప్రియుల అనుభవానికి వస్తుంది.

కవిత్వ వెన్నెముకలో- సామాజిక తాత్త్వికత మార్మిస్తు దృక్పథం, సామాజిక వాస్తవికతలోని, అన్యాయా అసమానత, ఆర్థిక వ్యత్యాసం దాగున్న కారణంగా- అభివ్యక్తి వైవిధ్యాన్ని కవి సుసంపన్నం చేస్తుంటాడు.

ఎవరికేమీ పట్టని లోకంలో, లోకం బాధను తమ బాధ చేసుకునే కవులను, వారి అంతరంగాన్ని, సృజన కోసం వారు పడే యాతనను, మానసికంగా వారికి కలిగే నొప్పిని అందుకు కారణాలను ఈతి బాధలను అర్థం చేసుకొని, ఆదరించే వాడే అసలైన కవిత్వ ప్రేమికుడు.

ఏ కవిత్వంలోనైనా- ఏ ఒక్క మార్గానికి చెందని, లేక ఏ మార్గంలోనూ ఇమడని శక్తివంతమైన కవులు ఎపుడూ ఉంటారు. వారిలో కొందరి కవిత్వాలు భావనా ప్రపంచంలో విహరింపచేస్తే, మరికొందరి కవిత్వాలు భవిష్యత్తుపట్ల గొప్ప ఆశని ఆకాంక్షని కలుగచేస్తూ కర్తవ్యాన్ని సైతం బోధిస్తాయి. ఆత్మ విశ్వాసాన్ని ప్రోది చేసే అక్షరాలు, మంత్రశక్తి కన్నా ప్రతిభావంతంగా- ప్రభావంతంగా పాఠకుల్ని ఉత్తేజితుల్ని చేస్తూ ఆలోచనల్ని తేజోవంతం కావిస్తాయి.

> ఏ కవిత్వంలోనైనా- ఏ ఒక్క మార్గానికి చెందని, లేక ఏ మార్గంలోనూ ఇమడని శక్తివంతమైన కవులు ఎపుడూ ఉంటారు

కవి ప్రతి అనుభూతికీ సామాజిక పరివర్తన వుంటుంది. ఏవో కొన్ని సాధారణీ కరణాల మీద ఆధారపడి ఎక్కడారాయడు. చాల వరకు ఆ కవిత్వం స్వీయ అనుభవంలోనిదైనా అప్పుడప్పుడూ అందులో బాహ్యను భవమూ అంతరానుభవమూ అక్షరీకరణకు అనుగుణంగా మారిపోతాయి.

కవుల్లో చాలా మందికి రాజకీయ సమస్యలపై దృష్టి ఉండదు. వీరిని పరిశుద్ధ కవిత్వవాదులు అనవచ్చు. వీరిలో చాలా మందికి సామాజిక దృష్టి, పర్యావరణ స్పృహతో పాటు నవ కవితాశిల్ప దృష్టిలోనే వీరి ఏకత్వం

ఏకదాటిగా రాసే వృత్తి కవుల వలన అంతగా ఒరిగేది కూడా ఏమీ ఉండదేమో. కాబట్టి అటువంటి కవులు తాము రాయగలిగింది రాసి ఆపై మానుకోవడం నిజాయితీయే అవుతుంది తప్ప, కవిత్వ ద్రోహం కాదు.

కవిత్వం అస్పష్ట, సంక్లిష్ట, అన్వయ కాఠిన్యత కారాదు. కవిత్వం మీద నిర్మాణ పద్ధతులమీద, పద్ధతుల్లోని ప్రతిభమీద, ప్రతిభలోని సృజనాత్మకతమీద- ప్రతీకల మీద, పదబంధాల మీద, ఊహాసామర్థ్యం మీద, అధిక దృష్టి ఉండాలి. అప్పుడే కవితా సృష్టి స్పష్టంగా సజావుగా సాగిపోతుంది.

కవిత్వం మనసులోకి ప్రవేశించిన వెంటనే కొన్ని భౌతికాతీత చర్యలను నెరవేస్తుంది. కవితాంశం అనుభవ పరిపాకంగా పరివర్తనమవుతుంది. ఆ దశలో విషయం విశ్లేషితమవుతుంది. అది అంశ్శకత్తులుగా విడివడి సంవేదనలనూ కలిగిస్తుంది. యదార్థ అంశాల రూపాలనూ, ఆలోచనాతరంగాలనూ మేల్కొల్పడం ద్వారా మనో ఫలకంపై కవిత్వమై రూపితమౌతుంది. ప్రాథమికంగా కవిత్వం కలిగించే అనుభూతి పరంపర తరంగమానంగా పెంపొందుతుంది.

కవిత్వంలోంచి కవిత్వాన్ని దున్నేది మంచి కవిత్వం కాదేమో. నాగేటి చాళ్ళల్లో జీవన బీజాలు చల్లిన తర్వాత ఫలప్రదమయ్యే పంట పొలంలానో, దాన్ని పండించే రైతులానో కవిత్వం పండాలి.

ఒకప్పటి విజయవంతమైన ప్రతీక ఎల్లకాలాలకు విజయ సంకేతమవుతుందనుకోడం పేరాశే. ఒకడు నడచిన బాటలోపోతే గమ్యం సులువుగా- సుఖంగా చేరుకుంటాననుకోవడం ముందుచూపుకు చీకటి అడ్డు తెర కట్టుకోవడమే. కాలానుకూలమైన ఆలోచనా, ఇతివృత్తా సంఘటనా- సంవిధాన నిర్మాణమూ అనే త్రిపుటి ఆరోగ్యప్రదంగా అమరినప్పుడే కవిత్వం జనరంజకం అవుతుంది.

కవిత్వమంటేనే బాధ్యతల్ని మోయడం. పరాయి బాధల్ని కలాల్లోకి ఒంపుకోవడం, సమాజ గోసని, తనకవిత్వ ఘోషలో ప్రతిధ్వనించడం- అలాకాని పక్షంలో స్వార్థంతో గాయపడ్డ గుండె భాష కవిత్వం ముసుగులో కర్కశంగా ధ్వనిస్తుంది..!?!


-ఎస్.ఆర్.భల్లం
సెల్: 9885442642

### తెలుగు భాష తీయదనం

నేను అన్న 'భవము"నకు
సాదు రూపమై
నాది అన్న భావమునకు సాధ్య రూపమై.
నన్నె చోదుని జాను తెనుంగు.
నన్నయ్య తిక్కన్నల జాణ తెలుంగు
అమ్మా ! అన్న మాటతో
అమృత భాండాన్ని చిలికిస్తూ,
జో్య అచ్యుతా నంటూ బ్రహ్మాండాన్ని
చిందిస్తూ,
విశ్వనాథ,సినారేల జ్ఞానపీఠమై
ప్రభవించింది.
గురజాడ,కందుకూరీల
జనపాట యై పల్లవించింది.
సామెతలు,శబ్దపల్లవాలు
సాహిత్య సమవాకారమై,
సరస్వతీ సాక్షాత్కారమై.
అష్ట దిగ్గజాలతో,దిగంతాన్ని స్పృశించింది,
అష్టావధానంతో అద్వైతాన్ని సృజియించింది,
అచ్చుల ఒరవడితో,పరువిడి
విచ్చిన కమలముల్లై,
అన్నమయ్య, త్యాగయ్యల గళ కీర్తనలై,
అజంతాల ,, మధురిమల
అమేయమైన తెలుగు శ్వాస
అమ్మ పొత్తిళ్ల నుండి
,ప్రపంచం పొలిమేర వరకు
వినిపిస్తుంది భాష ఘోష
తెలుగు విరిబోణి
సాహితీ తరంగ రసధుని,
సుమనోహర అక్షర కీరవాణి.


-సముద్రాల శ్రీదేవి
9949837743

### రామప్ప దేవళం..!!

రమణీయం.. కమనీయం..!
రసరమ్య "రామప్ప దేవళం..!!
అనల్ప శిలా సంజనిత వేదిక..!
అద్భుత కళావైభవ వారసత్వ భూమిక..!!
నాగరిక ద్రావిడ సంప్రదాయ-
నల్లరాతి ఏకశిలా నందితో
రుద్రేశ్వర ఆవాసం బహు సుందరం..!
నవరంగ స్తంభాలపై
నాసికా ప్రతిమల నృత్య భంగిమలు
కాకతీయుల కళాభిరుచి
శిల్పకళా భారతీయ సంస్కృతి
సజీవ శిల్పాల్లా
సహజ కళా ప్రకాశ మూర్తి వంతమై
విశ్వవ్యాప్త కీర్తి ప్రతీకలై
తెలంగాణాకి తలమానికమై..


-మహాశివభట్టు లక్ష్మణరాజు
సెల్: 94927- 70859

### అందివస్తాయా

ధరలేమైనా తగ్గుతాయా
ఓ నిరుపేద నిరీక్షణ-
సాగుకు తోడ్పాటు ఏమైనా అందేనా
ఓ రైతన్న ఎదురు చూపు-
ఆదాయపు పన్ను ఏమైనా తగ్గుతుందా
ఓ ఉద్యోగి మనోగతం-
రాయితీలు ఏమైనా అందివస్తాయా
ఓ బడా పారిశ్రామికవేత్త కోరిక-
పన్ను పోటు ఏమైనా దిగివస్తుందా
కార్పొరేట్ సంస్థల ఆరాటం.


- పంజాల జగన్నాథం
సెల్: 9948531985

### పుస్తక సమీక్ష

## బాలల వికాసానికి, సహజ ప్రగతికి దోహదం చేసే 'నల్లాలం పూలు'






కూకట్ల తిరుపతి గింతపని చేస్తడనుకోలేదు. గింత మంచి పని, గొప్పపని చేయాల్నని అనిపించంగనే ఆచరణలో పెట్టిండు. తాను ఉపాధ్యాయుడుగా పనిచేసిన (జడ్.పి.హెచ్.ఎస్. గంగారం, మం|| వీణవంక, జిల్లా|| కరీంనగర్) బడి పిలలల చేత కవితలు రాయించిండు. సృజనాత్మకత వెలికితీసిండు. పుస్తక రూపంలో తెచ్చిండు.

'నల్లాలం పూలు' ఎంత మంచి పేరు. ఈ పుస్తకానికి ఈ పేరు కాసులపేరు. ఈ పేరుపెట్టింది తెలంగాణ పదాలకు పరపతి పెంచే కూకట్ల తిరుపతి.

పిల్లలు అమాయకపు ముల్లెలు. అందాల హరివిల్లులు, ముత్యాల రంగవల్లులు, సెలయేటి గలగలలు, నవ్వుల మిలమిలలు. వెయ్యి వరహాలకు మించిందీ వయ్యి. ఈ వయ్యిని-మార్కుల గోలలో, ర్యాంకుల లీలలో, ర్యాగింగు దుమారంలో, ఆసిడ్ దాడిలో, పేదరికపు పెను ఆకలిలో, పెత్తనపు పెడచూపులలో చితికిపోయిన పసితనాలకు అంకితం చేసిండు. ఎంత గొప్ప హృదయం.

ఈ పొత్తంలో ఉన్నవి అమ్మ, నాన్న, గురువు, ఊరు, బడి, కవి, స్నేహం, ప్రకృతి - ఇలాంటి అంశాలే. కాని ప్రతి కవితలో ఉంది కొత్తదనం, పాఠకులను ఆకర్షించే గుణం. "అమ్మకడుపులో ఉన్నప్పుడు / ఉమ్మ నీటిలో ఈదినపుడు / అన్నీ తానైన అమ్మే / ఓ రక్షణ కవచం అవుతుంది." ఇది అమ్మ గొప్పతనాన్ని చాటే అద్భుతమైన మాట. "అమ్మకు ఆలంబన మవడమే అమ్మ ఆరాధన." ఇది అమ్మ రుణం కొంతైనా తీర్చుకునే అసలైన ఆలోచన. మరి నాన్న "గమ్యాన్ని చేరుకో / నీ వెంట నేనున్నా" నని అభయ మిస్తాడు. తనకు అందని చదువును అందిస్తాడు. ఆశల పందిరి నిర్మిస్తాడు." నాన్నని తన ముదిమిలో మన నయనంగా చూసుకోవాలి."

"గురువు శ్రమకు నింగి తలవంచుతుంది-భూమి తల కెత్తుకుంటుంది." గుడిలో ఉంటాడంటారు కాని, "బడిలోనే నిజమైన దేవుడు ఉంటాడు". "శిల్పం శిల కడుపున ప్రాణం పోసుకుంటుంది - గురువు నుంచే విద్యార్థి వ్యక్తిత్వం రూపు దిద్దుకుంటుంది." "భవితను నిర్మిస్తాడు - బతుక్కి అర్థం చూపిస్తాడు" అని ఈ కవితలలో ఉన్న పలుకులు గురువుల పట్ల గౌరవాన్ని పెంచుతాయి. "మా ఊరి బడి క్రమశిక్షణకు నిలయం / బడిలోని గురువులు మాకు ఆదర్శం". అన్ని బడులు అలా ఉండాలి. అందరు గురువులు అలా అనిపించుకోవాలి. సర్కారు బడిలో లభిస్తుంది "గురువుల ఆదరణ / గుర్తుండిపోయే బోధన" అనే విద్యార్థుల విశ్వాసాన్ని నిజం చేయాలి.

ఈ బడి పిల్లలు ప్రకృతి గురించి మనకు పాఠాలు నేర్పుతున్నరు. ప్రకృతిని వికృతిగా మార్చవద్దని, పర్వతాల నుంచి ఔన్నత్యాన్ని, తరువుల నుంచి త్యాగాన్ని, పశువుల నుంచి ఐకమత్యాన్ని, పక్షుల నుంచి స్వేచ్ఛను నేర్చుకోవాలని, ప్రాణులను స్వేచ్ఛగా బతుకనివ్వాలని కోరుతరు. ఆకు రాలుతుంటే-జీవితం శాశ్వతం కాదని, పువ్వు వికసిస్తుంటే-నవ్వుతూ జీవించాలని, కొవ్వొత్తి కరుగుతుంటే-పరులకు దారి చూపాలని, పండ్లనిచ్చే చెట్టులా పరోపకారిగా బతకాలని తెలుసుకోవాలంటరు. చీమలలో శ్రమ జీవన సౌందర్యాన్ని చూస్తరు. కాకుల గుంపులలో సమైక్యతా సందేశాన్ని వింటరు.

"మా పల్లె / నా జీవితపు హరివిల్లు / ప్రకృతి రమణీయతకు పుట్టినిల్లు" "మా పల్లె మాగాణం / అడుగడుగున సింగారం / పండును బంగారం" అని పరవశంతో పాడుకుంటరు. "కాలువల పొంటి పచ్చని చీరలు ఆరేసినట్టున్న పంటపొలాల సోయగం" చూస్తరు. "పురాతన కాలపు / కమనీయ కట్టడాలు / రమణీయ శిల్పాలు" దర్శిస్తరు. "మనిషికి అమ్మ ప్రేమ వోలె / పంటచేలకు నది ప్రేమ / నిరంతర ప్రవాహమై కొనసాగా"లని కోరుకుంటరు. చెరువు పొలాల కిస్తుంది ఎరువును, పారద్రోలుతుంది కరువును. అన్ని ఊర్ల చెరువులూ కళకళలాడాలని కాంక్షిస్తరు. వాగుతో తీయటి సోపతి చేస్తరు.

ఈ పిల్లలు స్నేహానికి గొప్ప విలువ నిస్తరు. "కష్టాల్లో ఉన్నప్పుడు కన్నీరవుతుంది / ఆనంద ఘడియల్లో పన్నీరవుతుంది." "పూవులో ఉంటుంది పరిమళం / స్నేహంలో ఉంటుంది జీవం" "సకలం ఉన్నప్పుడు కాదు / ఏమీ లేనప్పుడు వెంట ఉండేది స్నేహం" "స్నేహమంటే మనస్సులో పుట్టి మట్టిలో కలిసేంత వరకు తోడుగా వుండేది" అని నిజమైన స్నేహాన్ని చాటుతరు. "అనుబంధం అనే / అకౌంట్ ఓపెన్ చేసి / మమకారం అనే మనీ డిపాజిట్ చేసి / కోపాన్ని విత్‌డ్రా చేసి / నమ్మకాన్ని బ్యాలెన్స్‌గా ఉంచుకో / స్నేహం దానంతటదే / శాశ్వతమై వెలుగొందుతుంది" అని సరికొత్తగా చెప్తరు.

మన నోటి దగ్గరకు బుక్కెడు బువ్వ వెళుతుందంటే కారణం రైతు. పచ్చని పైరులా ఎల్లప్పుడు అతను నవ్వుతూ ఉండాలి. "ముక్కాలాలు గడియారం ముల్లు తీర్గ / ఇరాం లేకుండా కష్టించే దేవుడతడు" అని రైతు గొప్పతనాన్ని చాటుతరు. "అందం ముఖంలో లేదు / సహాయం చేసే చేతుల్లో ఉంటుంది" అని జనంలో సేవా దృక్పథం పెరగాలంటరు.

"చీకటిని చూసి భయపడిన వాడు వెలుగును చూడలేడు" "కాలయాపన కార్చిచ్చులో / కార్యాన్ని కాల్చకు / గుంపులో గోవిందయ్యాలా / జీవితాన్ని ముగించకు" వంటి గొప్ప సందేశాలు ఇందులో ఉన్నాయి.

కవితలు రాసిన వీళ్లు" గొంతు లేనోళ్ళకు గొంతుక కవి... భవితకు భరోసా కవి" అని కవి గురించీ రాస్తరు. నీలో పోసే భావాల ఇంకు పెరిగితే... కవిత్వ సారం పెరుగుతది అని కవికే సలహా ఇస్తరు. సర్కారు బడులలో ఆణిముత్యాలుంటారని వారి ప్రతిభను ప్రోత్సహిస్తే ఉజ్వలంగా ప్రకాశిస్తారని గంగారం పాఠశాల విద్యార్థులు నిరూపించారు. ప్రధానోపాధ్యాయుడు జున్నూతుల రంగారెడ్డి ప్రోత్సాహం, నల్లాలం పూలు తోటమాలిగా కూకట్ల తిరుపతి వినయశీలం లభినందించదగినది. ఈ పుస్తకం ఎంతో అందంగా తయారైంది. తునికి భూపతి వేసిన భావస్ఫోరకమైన, చూడ ముచ్చటైన ముఖచిత్రం చాలా ప్రశంసించదగినది. కవితలున్న ప్రతి పేజీకి కూడ బొమ్మలు వేస్తే ఈ కృతికి వచ్చేది మరింత అందమైన ఆకృతి.

ఈ పుస్తకానికి లభించింది డా|| చింతోజు బ్రహ్మయ్య బాలమణి మెమోరియల్ ఎడ్యుకేషనల్ - చారిటబుల్ ట్రస్ట్ ముస్తాబాద్ వారి ఆర్థిక సహకారం, వరించింది బాల సాహితీ పురస్కారం.

"ఒక కలం నుంచి లక్షల అక్షరాలు రూపం పోసుకుంటాయి - ఒక మెదడు నుంచి కోట్ల ఆలోచనలు పురుడు పోసుకుంటాయి." బాలల వికాసానికి, తద్వారా సమాజ ప్రగతికి దోహదం చేసే ఇటువంటి గ్రంథాలు ఇంకెన్నో రావాలి.

నల్లాలం గాయాలను మాన్పుతుంది. ఈ 'నల్లాలం పూలు' కవిత్వం జాతికి గాయాలు కాకుండా చూస్తుంది.

ప్రతులకు: కకుట్ల లక్ష్మి
ఇ.నెం. 8-3-207/2/4/ఇ/1
రోడ్ నెం.7, వసుదేవ కాలనీ, కట్టారాంపూర్
కరీంనగర్- 505 001
సెల్: 99492 47591


- ఎ. గజేందర్‌రెడ్డి
సెల్: 9848894086

## అమ్మకు నేను

అమ్మా నా పుట్టుక
మీకు వెలకట్టలేని
ఆనందం.

పుట్టగానే అమ్మ
మీకు గాయం
స్రుున వెచ్చని రక్తం...

అమ్మ రక్తంతో
ఒళ్ళంతా....
వెచ్చని తడి...
గాయం అయినా
అమ్మ మత్తులోనే
మొహం చిరునవ్వుతో...

ప్రశాంతంగా దేవత మూర్తి
అమ్మ స్పర్శ నుండి
బయట పడ్డ క్షణం
గడియారం నిశ్శబ్దంగా...

గుండెల్లో
గునపం దించినట్టు
మాటల వెక్కిరింతలు
ఆడపిల్ల ఆడపిల్ల అంటూ
శాపనార్థాలు
చెవుల్లో సీసం పోసినట్టు బాధ
అయినా

అమ్మ నాతోనే
అమ్మ చేతిలో నేను
అమ్మ చెరగని నవ్వులో నేను
అమ్మ ఆత్మ విశ్వాసంలో నేను
అమ్మకు భరోసానవుతా
మరో జన్మంటూ ఉంటే
అమ్మకు పాదానవుతా



-ఎలగొండ రవి
9848770345

## నానీలు

కలలు కని
కళ్ళు బరువెక్కాయా ?
సాకారంతో
దించేసుకో

కాలం
నిరంతర ప్రవాహం
మరి జీవితం
సుదీర్ఘ ప్రయాణం

కవిత్వానికి
పరిమళమెక్కువ
కవికి
ఆస్వాదనమెక్కువ

వెదురుకి
ఎన్ని గాయాలో
గాలితో మొరపెట్టుకుని
వేణువయ్యింది



-కయ్యూరు బాలసుబ్రమణ్యం
7780277240

## విద్య

విద్య లేని వాడు వింత పశువు
అని మనం నేర్చుకున్న పాఠాలు
ఎన్నటికీ చెరిగిపోని సత్యాలు.

మనిషిని సంస్కరించే ఒక ప్రక్రియ
విలువలు నేర్పించే ప్రక్రియ
వ్యక్తిత్వ వికాసం కలిగించే ప్రక్రియ
విజ్ఞాన జ్యోతి ని వెలిగించే ప్రక్రియ
కేవలం విద్య మాత్రమే.

మట్టి ముద్దను వ్యక్తి గా మార్చి
మనిషిని మహర్షి గా మార్చి
అజ్ఞాన తిమిరాన్ని
ప్రకాశవంతంగా మార్చి
జీవిత గమనాన్ని మార్చి
ఆలోచన విధానాన్ని మార్చి
సమాజానికి అందించేది
విద్య మాత్రమే.

మంచికి చెడుకు తేడా చెప్పి
మనిషి పశువు కు తేడా చెప్పి
మనిషికి సమాజం పట్ల
బాధ్యత ఉందని చెప్పి
ఎదుటి వాడి మంచి కోరుకోవాలని
చెప్పినది విద్య మాత్రమే.

నీ చదువు సార్థకం కావాలంటే
నీ విజ్ఞానం అందరికీ అందాలంటే
నీ విద్య నలుగురికి ఉపయోగపడాలంటే
ఓ మనిషి నువ్వు ఒక
దార్శనికుడు గా మారాలి
ఇదే నువ్వు విద్యకు ఇవ్వాల్సిన గౌరవం



-అరుణ డేనియల్
9000606889

## నానీలు...!!

తొలి చూపులో
మనసు పడ్డాడట...!
తెలిసేది అప్పుడేనా..?
ముడిపడాలి..!!

ఇది జీవితంరా..
పరీక్షించేది కాదు..!
విలువలను
పరిరక్షించాలి..!!

మనసు
చెప్పిన మాట వినదు..!
ఇద్దరిలో
ఎవరినెంచుకోవాలు..!?

హమేషా జీవితం
తమాషా కాదు..!
ఆట మలుపు
గెలుపులోనే...!!



-మరికంటి
సెల్: 9640407103

## కాలం మిగిల్చిన "విషాదం"

మనిషి శిఖరాలు కూలిపోతున్నాయి.
నీడలా నీ చుట్టూ చీకటి పొరలు
అల్లుకొని...మరణ మృదంగం మ్రోగిస్తూ
ప్రాణం అనే పర్వత శిఖరాలను
నెలరాలుస్తుంటే....
దుఃఖమంత ఏరులై పారుతుంది.
రాతిరంత కనురెప్పలపై భయం దుప్పటే.
సూర్యోదయానే ఎక్కడ రెక్కలు
విరిగిపోతాయోఅని.
హృదయంలో ఏదో కాల శూలం
పగబట్టి గుచ్చినట్లు.
బంధాలు అనే
ఈ మానవతా హృదయాలను
ఎంత చిలికినా శూన్యమే దర్శనమిస్తుంది.
ప్రేమాభిమానాలన్నీ మైనంలా
కరిగిపోతున్నాయి.
నిప్పంటించిన అగ్నిశిఖల్లా
దహించుకు పోతున్నాయి.
రంపపు కోతల్లా మారి నరికేస్తున్నాయి.
పారే సెలయేటి అలల తాకిడిలో
చిక్కుకొని ప్రాణం ఊగిసలాడుతోంది.
ఎడారి ఉసికె దారులగుండా
ప్రవహించిన నీటిదారలు...
ప్రేమగుర్తుల తడిని వెతుకుతుంది.
ప్రమిదపు కాంతిరేఖల...
మిణుగురుల ఆశలైనా
బతకాలి ఇపుడు.
ఈ వడగాలుల ప్రళయాన్ని ఆపడానికి
మానవత్వం ఉన్న మనిషి కావాలిప్పుడు.
ప్రాణమనే దీపాలను కాపాడటానికి
కొన్ని చేతులు కావాలిప్పుడు.
మనిషి అనే కవచకుండములను
ధరించిన హృదయాలు కావాలిప్పుడు.
చుట్టూ మనిషితనం కరువైన
లోకానికి ...కాసింత తోడునిలిచే
అభయహస్తం కావాలిపుడు.



-అశోక్ గోనె
9441317361

## తరతరాల కోసం!

ఒక రెక్క
భూమి మండుతోంది
మరోరెక్క
హిమ శిఖరాలు నీరై ప్రవహిస్తున్నాయి
ఆమె జాన్ తగలబడుతుంది
వెలాండ్ కరిగిపోతుంది
ఇంకెంత కర్బన కల్మషం సృష్టిస్తారు?
మీ సుఖాల కోసం భూగోళాన్ని
నిప్పుల కొలిమిలా మండిస్తారు
మీ ఆనందం కోసం భూమ్యాకాశాలను
మలినకాసారం చేసుకుంటారు
సముద్రమట్టం
పెరుగుతూ ఒకవైపు
ద్వీపకల్పాలు
ముదుగుతూ మరోవైపు
భూగోళం బద్దలైతే
నువ్వు వుండేవ్-నేనూ వుండ
ఇప్పటికీ మునిగిపోయిందేమీ లేదు
రేపటితరం కోసం ఒకొక్కరు
ఒక్కొక్క మొక్కనాటి వెళ్ళండి
మీ పిల్లలు నీరుపోసి పెంచుతారు
మీ మనవళ్ళు బతికి బట్టకడతారు



- గుర్రాల రమణయ్య
సెల్: 9963921943

# విద్వాన్ సర్వత్రపూజ్యతే

అందరూ అదృష్టవంతులుకారు. కొందరే అలా అవుతారు. ఎందుకంటే కృషి, పట్టుదల అనే రెండు చేతులతో ధైర్యం సాహసం అనే పాదాలతో ముందుకు నడిచేవారే అదృష్టమనే జీవితాన్ని ఆనందంగా గడపగలుతాడు.

విమల, విరూపాక్ష అందుకు నిదర్శనం. కష్టపడి కాక, ఇష్టపడి చదివారు కాబట్టి విమల ఐ.ఏ.యస్. అయింది. విరూపాక్షి ఐ.పి.యస్. అయ్యాడు. చిత్రమేమిటంటే వారిరువురూ ఒకే స్కూల్లో నర్సరీ నుండి ఒకే బడిలో చదివి, ఇంటర్ నుండి వేరైనా మనసొకటిగా ఎదిగారు. ఉద్యోగాల్లో చేరిపోయారు.

వారితో పాటు చదివిన వారి ప్రియమైన మిత్రులు ఇంకా నలుగురున్నారు. వారేమైనారో చూద్దామా! ఆ నలుగురిలో ఇద్దరు ధనవంతుల బిడ్డలు, మరో ఇద్దరు మధ్యతరగతివారు. ధనవంతుల బిడ్డల్లో ఒకరు సోమరి, స్కూలుకు డుమ్మా కొట్టే రకం కాదు- మరీ! అనుకుంటున్నారా! చదవండి. హోంవర్క్ చేసే వాడు కాదు ఒకరకంగా చెప్పమంటే చెబుతాడుకాని రాయమంటే వాడికి ఒళ్లంతా చెమటలుపట్టేవి. గుంజీలు తీయించినా చెంప చెళ్లుమనిపించినా! తొడపాయసం పెట్టినా! చెవి మెలి వేసినా! క్లాస్ రూం బయటనుంచోబెట్టినా! ప్రిన్సిపాల్‌కు కంప్లెంట్ ఇచ్చినా! ఆయన దండనకు బదులుగా, నీతి కథలు, బుజ్జగింపు మాటలు చెప్పి, చెప్పి విసుగొచ్చి, తల్లిదండ్రులను పిలిపించి, నిలదీసినా! వాళ్ల తల్లితండ్రులు చెప్పినమాటలు విని, ఆశ్చర్యపోయాడు ప్రిన్సిపాల్!

వాళ్ల తాత, మనవడు బంగారు కొండ, వజ్రాలమూట అని గారాబం చేయడం. తల్లి తండ్రి దండిస్తే వారిని ఈ ముసలాయన మనవడిముందే దులిపేయడం చేత వాడికి తల్లితండ్రులంటే చులకన భావం ఏర్పడింది. ఓ సారి వాళ్లమ్మ ఇంగ్లీషు, మ్యాత్స్ టీచరు ముందు కంటతడి కూడా పెట్టుకుంది. పిల్లాడు నిజంగా ముద్దుగా ఉంటాడు. తెల్లని తోలు ఉంగరాలజుట్టు ముక్కు, కన్నుదోయి గడ్డం. అంతెందుకు వాడి మొహం చూస్తే వాణ్ణి కొట్టబుద్ధి కాదు.

వాళ్ల తాత ఓసారి ప్రిన్సిపాల్ గారికి ఫోను చేసి, "మీరు చెప్పండి మా ఇనాయత్‌ను కొట్టకండి వాడే నేర్చుకుంటాడు" అని చెప్పాడట.

ప్రిన్సిపాల్ కూడ ఓ దీర్ఘనిట్టూర్పు విడిచి టీచర్లందరిని పిలిచి "కత్తికిలేని దురద కందకెందుకు వాణ్ణి వదిలేయండని" అయినా అలాగని వాణ్ణి మరీ వదిలేయకండి అని చెప్పాడు.

వాడు కాస్త పది పల్టీకొట్టేశాడు. ఉన్న ఆస్తి కాస్త దాయాదుల వల్ల కొంత పోగా, దుబారాలకు పోయి, మధ్యతరగతికన్నా మధ్యగా మారిపోయాడు.

విమల, విరూపాక్ష సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ దిగి బయటకు వస్తుండగా "టైంపాస్ పల్లీ, బఠాణి" అనే మాట వినపడి అటుగా చూశారిద్దరు. దగ్గర దగ్గరగా పదమూడేళ్లు ఆ కంఠస్వరం విన్నవాళ్ళ మధ్య ఓ ఏడెనిమిదేళ్లు వినకపోయినంత మాత్రాన ఎలా మరచిపోగలరు.

వాళ్ళ ప్రక్కనుండే వెళుతున్న వాణ్ణి ఆపి "అరేయినాయిత్" అని పిలిచాడు విరూపాక్షి. "వదలండి సార్" అంటు వెనుతిరిగాడు.

విమల, విరూపాక్షని చూసీ చూడగానే ఖంగుతిని తలదించుకుని "వదలండి సార్" దులుపుకపోబోయాడు. వాడికి విమల అడ్డంగా నిలుచుండిపోయింది. "ఏమిటి మేడం వ్యాపారం చేసుకోనీయరా" అన్నాడు. వాడి మెడ చుట్టూ చేయివేసి బయటకు నడిపించుకుంటూ తీసుకెళ్లాడు వీరూపాక్షి. విమల వారిరువురినీ అనుసరించింది.

స్టేషన్ బయటకు వచ్చాక "ఎలా ఉన్నావురా" అని అడిగాడు విరూపాక్షి.

"చూస్తూ అడుగుతున్నారే... సార్... టైంపాస్... టైంపాస్" అని వాళు చదివేప్పుడు తెలుగు మాస్టారు "వరేయ్ శుంఠల్లారా ఇప్పుడశ్రద్ధ చేశారో రైల్వే ప్లాట్ ఫారాలపైనా టైంపాస్ - టైమ్‌పాస్, చనా బఠాణా" అంటూ బోగీల్లో అమ్ముక బ్రతకాల్సొస్తుంది. బీ కేర్‌ఫుల్ బ్రదర్స్" అనే వారు కదా! ఇదిగో సార్ మాట అక్షరాలా పాటిస్తున్నాం" అని అంటున్నప్పుడు యినాయత్ కళ్లల్లో ఆనకట్ట తెంచుక దూకిన నీరులా జాలువారాయి కన్నీళ్ళు. విమల, విరూపాక్ష కళ్లు కూడా చెమ్మగిల్లాయి.

విరూపాక్ష వెంటనే యినాయత్ రెండు కళ్లల్లోంచి వస్తున్న నీటిని తుడిచి "ఛీ బాధపడకురా" అనగానే -

"బాధపడక... చిలకకు చెప్పినట్టు చెప్పారు టీచర్స్... ఇష్టపడి చదవండిరా! కష్టపడి చదువుతున్నామని అనుకోకండి... భవిష్యత్ మీ చదువు మీదే ఆధారపడి ఉంది గుర్తుంచుకోండి. ఎన్నిసార్లో కాదు వందలసార్లు చెప్పుంటారు. (కుడి చెంపతనకు తాను వాయించుకుంటూ) మనం వింటేనా!" యినాయత్ గొంతుగాద్గికమయింది. మరో మారు వాడికళ్లు నీలాలయ్యాయి. తమాయించుకుంటూ, "మా తాత గారాబం నన్ను గుబ్బులేపింది. అమ్మ పోయింది. నాన్న బార్లో సర్వర్‌గా పనిచేస్తున్నాడు. నా పెళ్లాం షాపింగ్ కాంప్లెక్స్‌లో కుట్టు పని చేస్తుంది" అని ముగించాడు.

దీర్ఘ నిట్టూర్పు వదిలారు విమల విరూపాక్షి. ఇనాయితుల్ల వీపు నిమురుతూ విరూపాక్షి "జాన్సన్ గాడేం చేస్తున్నాడు" అని అడిగాడు.

"రండి అంటూ అల్ఫా హోటల్లోకి తీసుకెళ్లి ఫ్యామిలీ రూపంలో బిర్యాని అమ్మే గదిలోకి తీసుకెళ్లి కాళీగా ఉన్న టేబుల్ బెంచీల మీద కూర్చోపెట్టి స్టైల్‌గా "అరే! జాన్సన్ మూడు చికెన్ బిర్యాని లారే" అన్నాడు.

"లారూసాబ్" అని ఆ గొంతేదో పరిచయస్తుడిదిలా అనిపించి లోపలికి వెళ్లే వాడల్లా ఆగి వీరిదగ్గరికి వచ్చి "అబ్బే! నువ్వా! నీవు బిర్యాని తిని పెళ్లాం బిడ్డలకేమి పెడ్తావురా !" అంటూ పక్కనున్న వారిని చూస్తూ "వీళ్లెవరు" సంశయంగా అడిగిన జాన్సన్‌తో "గుర్తుపట్టు" అని అన్నాడు యినాయత్.

"ఊ... ఊ... ఊ... ఆ మీరు యాదికొచ్చింది... విమల విరూపాక్షులు అవునా? యామ్ ఐ రైట్ యన్.టి.ఆర్. స్టైల్లో అన్నాడు.

యినాయత్, విమల, విరూపాక్షి ఒకరినొకరు చూసుకుని నవ్వుతున్నారు. "మీరెందుకు నవ్వుకున్నారో నాకర్థమైంది. ఏయిత్ క్లాస్‌లో నేను చెప్పిన డైలాగే కదా!" అన్న జాన్సన్ భుజం తట్టి "వ్వా! ఇన్నాళ్లయినా గుర్తుంచుకున్నావన్న మాట... ఇంత జ్ఞాపకశక్తుంది ఎందుకు ఇలా తయారయావ్ జాన్" అంది విమల.

"మేడం! ఇప్పుడున్న తెలివి అప్పుడు లేదు. ఇప్పుడున్న తెలివి అప్పుడుంటే ఇప్పటిలా ఉండే వాణ్ణి కాదు - అంతా ఫేట్" కుడి బొటనవ్రేలితో ఫాలభాగంపై ఎడమనుండి కుడికి గీస్తూ అన్నాడు జాన్సన్.

"నేనొప్పుకోను ఫేట్‌ను ఫట్‌మని కొట్టేది శ్రద్ధ. అది లోపించి మనమిలా అయ్యాం. శ్రద్ధను చేరదీసుకుని వీళ్లిలా అయ్యారు" అన్నాడు యినాయత్.

ఇంతకూ జాన్సన్ క్లాస్ రూమ్‌లో మాష్టారడిగిన "వరేయ్ మీ ఫ్యూచర్ ప్లాన్స్ ఏమిట్రా" అని అడిగితే ఒక్కొక్కరూ ఒకోరకంగా చెపితే మన జాన్సన్ మాత్రం "సర్వర్ సుందరం అవుతాన్ సార్" అని అన్నాడు. మాష్టారు వీడి జవాబు విని గతుక్కుమన్నారు. మిగితా పిల్లలందరూ గొల్లున నవ్వారు.

"ఇంతకూ మన ప్రేమ్ కౌర్, కుమారీలు ఎలా ఉన్నారు" అని అడిగిన విమలకు జాన్సనే సమాధానమిచ్చాడు.

"ప్రేమ్ కౌరేమొ ఓ సింధి వాణ్ణి ప్రేమించి పెళ్లాడి, ప్రేమ్ ఫుట్‌వేర్ షాపుకు షెఠాణి అయి గల్లాపెట్టి చూసుకుంటుంది. కుమారి టెన్త్‌లో మునిగి మోండా మార్కెట్లో కూరగాయలమ్ముకుంటోంది" మిగితా వాళ్ల గురించి చెప్పాడు.

"జాన్ కుమారి ప్రేమ్‌ను మేమొచ్చామని చెప్పి ఫోన్ చేయి. మనం ఆరుగురం కలిసి ఈ అల్ఫాలో టీ త్రాగి చాలా ఏళ్లయింది. వెంటనే రమ్మని పిలువు" అంది విమల.

విమల ఏమి చెప్పబోతోందో ముందే ఊహించిన యినాయత్, కౌర్, కుమార్‌లకు ఫోను చేశాడు. పదిహేను ఇరవై నిముషాల వ్యవధిలో వారిరువురూ వచ్చారు.

కారా బిస్కెట్లు టీలోనంజుకు తింటూ స్కూలు విషయాలు చేసిన తప్పులు ఒప్పులూ మాట్లాడుకున్నారు. మనసారా నవ్వుకున్నారు.

"మన సర్వర్ సుందరం కుమారికి లైన్ వేస్తున్నాడు తెలుసా" అంది కౌర్ విమలతో "మరింకేం ఇంకా ఎందుకు ఊరుకున్నారు" అంది విమల.

"ఏముంది మనదేశంలో కులం పిచ్చి, జాతిపిచ్చి, ప్రాంతం పిచ్చి, మత పిచ్చి, ఉన్న పిచ్చి, లేని పిచ్చి, పిచ్చి దేశం, పిచ్చి మనుషులు" ఆవేశంగా అన్నాడు జాన్సన్.

"వరేయ్ దేశాన్ననకురా! తంతా! మనదేశమొక పూదోట, సర్వమత సామరస్య వేదిక. దేశం కొట్టుక, తన్నుక చావమందా! మన దేశం నిజంగా గొప్పదేశం. మనమే పిచ్చోళ్లం" కౌర్ చూపుడు వ్రేలుతో హెచ్చరిస్తున్నట్టుగా చేయి ఊపుతూ అంది.

"అవును. నేను కూడా కౌర్ మాటలతో ఏకీభవిస్తున్నాను. దేశం పిచ్చిది కాదు. రాయప్రోలు వారేమన్నారో తెలియదా..." ఏ పూర్వపుణ్యమో ఏ యోగబలమో జనియించినాడవీ భరత ఖండమున, ఏ మంచి పువ్వుల ప్రేమించినావో... నిను మోచె ఈ తల్లి కనక గర్భమున అన్నాడు. నేనంటున్నాను గత జన్మ సంస్కార నీతి రీతి గతులచే నడయాడుచున్నవీ ఆంధ్ర రాష్ట్రమున..." కొంచెం ఆవేశ స్వరం రాగయుక్తంగా విరూపాక్షి అనగానే అందరూ "హియర్.... హియర్" అన్నారు. వారు కూర్చున్న టేబుల్ అటు ఇటు వాళ్లు కూడా నిజమన్నటు టేబుల్‌పై చరిచారు. ఒకడైతే విజిలే వేశాడు.

"అమ్మా! యూత్ అప్పుడప్పుడూ దేశభక్తి, రాష్ట్రభక్తి కూడా చాటుకుంటారని ఋజువు చేసుకున్నాం" అంది కుమారి.

ఆడవాళ్లు ముగ్గురూ ఒకరి చేతులతో ఒకరికొకరు చప్పట్లు కొట్టుకున్నారు.

"ఇంతకు కుమారీ - జాన్ ప్రపోజల్ ఓకేనా..." అన్న విమల మాటకు. కుమారి సిగ్గుపడుతూ "ఓకే" నన్నట్టు తలూపింది.

కౌర్ మోహం చిన్న బుచ్చుకుంది. అది చూచి యినాయత్ "వాట్ కౌర్ కుమారి జాన్‌ను పెళ్లి చేసుకోవడం ఇష్టం లేదా" అన్నాడు.

"ప్రేమించి పెళ్లి చేసుకోవడం అరమరికలు లేకుండా కాపురం చేయడం పూర్వజన్మ సుకృతమే... అందుకు కాదు. బాగా చదువుకోలేకపోయాం మనం నలుగురం. నేనేమో ఇంగ్లీషు టీచర్‌కు కలెక్టర్‌నవుతానని చెప్పాను. కుమారేమొ సాఫ్ట్‌వేర్ ఇంజనీరవుతానని చెప్పింది. ఇనాయత్ గాడేమొ ప్రొఫెసర్ అవుతానన్నాడు. ఇనాయత్ గాడేమొ చనాబఠాణీ, కుమారేమో మోండా మార్కెట్లో వంగాయ్ బీరకాయ్, నేనేమో చెప్పుల దుకాణం అనుకున్నది అనుకున్నట్టుగా ఒక్క జాన్ గాడే... సర్వర్ సుందరం అవుతానన్నాడు అయ్యాడు" అన్న కౌర్ మాటలకు, జాన్ బుంగమూతి పెట్టాడు. మిగితా అందరూ పకపకా నవ్వారు.

"ఒక్క విమల, విరూపాక్షులే చెప్పినది చెప్పినట్టయ్యారు గ్రేట్... వన్స్ ఎగేన్ కంగ్రాట్యులేషన్ వీ బోత్" అని కౌర్ అనగానే మిగితా నలుగురు లేచి విమల విరూపాక్షులకు చేతులు కలిపారు.

"అందుకే తెలుగు సార్ అనే వారు... "విద్వాన్ సర్వత్రపూజతే" అని అన్నాడు యినాయత్ - అందరూ చప్పట్లుకొట్టారు.

కౌర్ ఈ శ్లోకం బాగా చెప్పేది "అన్న విమలతో" చెవులు పీకించు, పీకించుకొని నేర్చుకుంది మరి" అన్న జాన్ వీపున ఓ గుద్దుగుద్దింది కౌర్ సిగ్గుపడిపోతూ.

"నేను మొత్తం శ్లోకం చెప్పనా" అని లేచినుంచున్న యినాయత్‌ను అందరూ ప్రోత్సాహించారు.

"స్వగృహే పూజ్యతే మూర్ఖః స్వగ్రామే పూజ్యతే ప్రభు
స్వదేశే పూజ్యతే రాజః విద్వాన్ సర్వత్ర పూజతే" అని పూరించాడు. "శబాష్ యిన్నూ" అంటు నెత్తిపై మొట్టికాయ వేశాడు జాన్.

"గోడ కుర్చీ శ్లోకం బాగానే వంటపట్టినట్టుంది" అంది కుమారి. అందరూ ముసిముసిగా నవ్వుకున్నారు.

"వరేయ్ మీరిరువురూ చదివి విద్వాన్స్ అయ్యార్రా... మీరిరువురూ మన రాష్ట్రమే కాదు మన దేశమూ గర్వించేలా పూజింపబడాలిరా" అన్న జాన్ మాటలకు, ఆత్మవిశ్వాసం తొణికిసలాడగా తప్పకుండా ప్రయత్నిస్తామన్నట్టు తలూపారు, విమల విరూపాక్షులు.



-టి.వెంకట్ స్వామి
9391109616

## జ్ఞానోదయం

బ్రతకు బాగుండాలని తల్లితండ్రులు
బడిలో చేర్పి అక్షరాలు నేర్పించారు
గురువులు చెప్పిన పాఠాలు విని నేను
ఇష్టపడి పట్టాలు సాధించాను
పిడికెడు అన్నం పెట్టని పట్టాలు
నన్ను చూచి నవ్వుతున్నాయి
నలుగురిలో నన్ను ఎగతాళి చేస్తున్నాయి
ఆశలు పెంచుకున్న తల్లితండ్రుల
ఆశలు అడియాశలు చేశాయి
చేతి వృత్తులు నేర్చుకుంటే
జీవితానికి చేదోడు వాదోడుగా ఉండేవని
ఇప్పుడు తెలసిందినాకు
చేతులు కాలిన తర్వాత
జ్ఞానోదయం కలిగింది
గతిలేని నా జీవితానికి ఆసరలేదు
అవనిలోనాకు మెతుకు లేదు
చదుకున్నవాడు ఎం చేస్తాడని
ఎవ్వరూ పనివ్వారాయే
నిరుద్యోగ ఫించన్ కోసం ఎదురు చూసి
కన్నులు పువ్వులు పూచి
కాయలు కాస్తున్నాయి
నిరుద్యోగ యువత ఇలాగే నుంటే
మన దేశ భవిత అదోగతియే కదా!



-జాధవ్ పుండలిక్ రావు పాటిల్
9441333315

## బా(పూ)ల వనం

మల్లె మనసున్న బాలల్లారా
గులాబి బుగ్గల మొగ్గల్లారా
బంతి పువ్వుల నవ్వుల్లారా
చామంతి కళ్ళున్న చిన్నారులారా
మందార మోమున్న మైనాల్లారా
సంపెంగ సిగ్గులున్న పిల్లల్లారా
కనకాంబర కళ్ళున్న కూనల్లారా
తామర కాంతుల తారల్లారా
జాజి పరిమళపు జాజిబిలారా
మీరే ,మీరే రేపటి ప్రగతికి వారధులు
మీరే ,మీరే రేపటి జగతికి సారధులు

## నెమలి చెలిమి

అందమైన నెమలి
నాట్యమాడుతానంది
ఈకలెన్నో ఇస్తానని
ఒట్టులెన్నో పెట్టింది
తనతో జట్టు కట్టమని
పట్టు పట్టి అడిగింది
చెలిమి మేము చేయగా
చక్కగా నాట్యమాడింది
తనతోనే ఉండమని
ఎగిరి గంతులేసింది

-కయ్యూరు బాలసుబ్రమణ్యం
9441791239

## భువిపైన బ్రహ్మలు

కర్తవ్యమే కిరీటమై
అలరారు ఆత్మబంధువులు!.
అంకితభావమే ఆభరణమై
అక్కున చేర్చుకునే ఆపద్బాంధవులు!.
ప్రాణాలను సైతం లెక్కచేయక
రోగుల ప్రాణాలను కాపాడు దేవుళ్లు!.
కరోనా కబళిస్తుందని తెలిసినా
వృత్తినే ప్రేమించే
అకుంఠిత దీక్షాదక్షులు!.
ఇల్లు వాకిలి
భార్యాపిల్లలకు దూరమై
కరోనాబాదితులకు
ఆత్మీయబంధాలై దాగే స్నేహితులు!
భరతమాత రక్షణకై
బొందితో పోరాడే సైనికులు!!
వీరే ఇలలో బ్రహ్మలు!
నుదుటి రాతను మార్చే విధాతలు!!

-అయిత అనిత
8985348424

## భేతాళ ప్రశ్న

(కథ)

"ఈ ఏడు 'టాప్-త్రి' బుక్స్ గురించి చెప్పు రాజా?" భుజంపై ఉన్న భేతాళుడు అడిగాడు రాజును.

"ఇప్పుడు చదవడమెక్కడుంది? అంతా చూడడమే..."

"ఓహో... అలాగా? పోనీ చూడదగ్గవాటిలో టాప్ 'త్రి' చెప్పు?"

"క్రింద నుండి పైకి చెబుతాను.."

"ఏదోకటి ఏడు.."

"టాప్ త్రి.... యూత్ చూసే సినిమాలు..."

"ఎట్టా ఎట్టా...ఎట్టెట్టా... మహిళామణులు, కుటుంబ సమేతంగా అందరూ చూసేది సినిమాలే కదా!... దానికి టాప్ త్రి ర్యాంక్ ఇచ్చావేమిటి?"

"చెప్పేది వినహే... మధ్యలో నీ చచ్చు ప్రశ్నలూ నువ్వూనూ..."

"ఆ..ఆ... చెప్పు చెప్పు" ఆత్రుతగా వినడానికి చెవులు రిక్కించాడు భేతాళుడు.

"టాప్ టూ.. 'టీవీ'లో ఆడవాళ్లు చూసే సీరియల్స్..."

"ఓహో అలాగా... సినిమాల నుండి టీవిలకు అతుక్కుపోతున్నారా ఆడవాళ్ళు? మరి టాప్ 'వన్'?" మరింత ఆత్రంగా అడిగాడు భేతాళుడు.

"ఇంకేముంది... అందరి చేతుల్లో నలిగిపోతున్న స్మార్ట్‌ఫోనే నెంబర్ వన్. అందులో 'ఫేస్‌బుక్కు, వాట్సాప్పు, యూటూబు ఇలా ఎన్నో... ఎన్నెన్నో విశ్వం మొత్తాన్ని కృష్ణుడు నోటిలో చూపించినట్లు, అరచేతిలో చూపించేస్తుందీ స్మార్ట్‌ఫోన్..." ఇంకా రాజు మాట పూర్తవ్వనే లేదు, భేతాళుడు "అయితే ఇప్పుడే వస్తానుండు" అంటూ టింగ్‌మని మాయమైపోయి, సెల్‌ఫోన్స్ అమ్మే షాపులోకి దూరాడు స్మార్ట్‌ఫోన్ కొనుక్కునేందుకు.



-చలపాక ప్రకాష్
9247475975

## తోలు చెప్పులు

ఇయ్యాల నేను
మందను అడివిదాంక తోలిన
పెద్దకట్యోంత నాల్గు పొట్టేల్లకు
బ్యారం కుదిరి బయాన ఇయ్యగానే
చెప్పులులేని కాళ్లు గుర్తొచ్చినయి.....

గొర్రెలకు గెట్కేలు ఉసినట్లు
నా అరికాళ్ళు ఎన్నో దినాలసంది
నేర్రెలు వారినయి..
మందను పిల్లలకు సూపి
అంగడిదాంక పోయిన.....

నాలుగు సార్లు అంగడంత తిరిగిన కాని
యాడనా కంటికి కాన్రాలే..
తల్లి దప్పిన గొర్రె పిల్లల అడ్కియిడ్కి
అంగడంతా చుట్టిసేంది కాని
తోలు చెప్పులే కన్పియ్యలేవు....

ఎప్పుడు పోయిన
అంగడిమూలమలుపు కాడనే ఉంటుండ్రి
అట్లకెల్లే పానం పగటేల్లదాంక దిరిగింది
అయినోడు కానోడు అంగట్ల కనిపిస్తే
పానం చిట్టుమంటుంది
ఎన్నడు కాళ్లుగాలని నాకు పాత సుట్టం
కనబడితే నడిరోడ్డు మీద
కాళ్లు కాలి కోతిల బిత్తిరి మొఖంతో
ఎండకు అట్లే దిరిగిన....

ఎన్నడు చెప్పుకేద్వని నా పాదాలు
ఇయ్యాల అంగడంతా ఆర్బాటంగ
తిరగాలంటే అలోచన చేసినయి
పానం ఉకే నిలవడక మళ్ళీ
అంగడిలకు కాళ్లు పెట్టిన...
నా నడక
దొంగ కోడిపిల్లల గబ్బగబ్బ ముందుకు సాగింది
ఎవ్వరు లేని కూర దుకాణం కాడ ఆగి
కిల బోటి రూమాలులో కట్టుకున్న.....

ఇంటి తొవ్వ నాకే కొత్తగా కనబడుతుంది
లబ్బరి చెప్పులు ఎన్ని వచ్చిన
నాల్గు దినాలు నాతో నడిసే
తోలు చెప్పులకే ఆరాట పడిన
ఎన్నడు లేని ఈ సిగ్గు ఇయ్యాల
తొక్కిపడేసే చెప్పుల కాడ
పాదం కరిగె పసిగూనైంది.....

ఈ దినంకి కూడ పాత చెప్పులు
దొరికిన బంగారం దొర్కినట్ల
ఏస్కునేటోల్లు అంగట్లో
నాతో పాటు శానమంది
కనిపించిండ్రు..... వాళ్లకు
చెప్పులు లేని పాదాలే కాదు
కంటికి కనబడని మనసు కూడ
లోలోపల ఎంత కరుగుతుందో......

ఇగో.. నిన్నే కూర దించెటప్పుడు
నాలుగు రాళ్ల ఉప్పు దిసెయ్యి
నా కాళ్లను చూసి ఎన్నో రంగు రంగుల
చెప్పులు నవ్వుకుంటా పోయినయి
మందకాడికి చీకటైతుంది
పిల్లలు కడ్పుకు ఆకలి గొన్నరు
నాలాగ కాళ్ళకు గాదు...

పోతా ఈ అంగడి కాకపోతే ఇంకోటి
నాతోనే నా నీడై నడిసే
ముళ్ళ తోవ్వనుతట్టుకునే
తోలు చెప్పులకే మళ్ళంగడి
మళ్లీ పోతా.....

(భార్యతో పసిగూనలా వాదిస్తూ మందకాడికి బోటి కూర సద్ది తీసుకోనిగొల్ల కురుమ తాతా పయనం)



-దండు వెంకట్ రాములు
చరవాణి:6303163202

## కవి..రవి

మదిన తట్టినాలోచనలను..
అక్షరాలుగా అంకురింపచేసును..
కనుల ముందు దృశ్యాలను..
కవితలుగాను మలుచును..
వీనుల విందైన పాటలను..
తమ కలమునుండి జారవిడుచును..

సామాజిక రుగ్మతలను..
సమర్థవంతంగా చూపించును..
ఆర్థిక స్థితిగతులను..
అర్థమయ్యేలా తెలుపును..
రాజకీయ కపట నాటకాలను..
తేటతెల్లముగా చూపించును..

మాయలు చేసె కేటుగాళ్లను..
అక్షర బాణాలకి గురిచేస్తుండును..

సాయము చేయు సాయబులను..
సగౌరవంగా సన్మానించును..
పేద,ధనిక తారతమ్యాలను..
పెన్నుతోటి పెకిలిస్తుండును..

అన్యాయము జరిగినను..
ఎదిరించుటకు ముందుండును..
న్యాయము జరుగు వరకును..
అక్షర అస్త్రాలను సంధిస్తుండును.
ఎవరికి లొంగకుండును..
ఎదిరించి ముందుకు సాగును..

పదునైన పదజాలం తోడను..
పాలకులను ప్రశ్నిస్తుండును.
సమాజ హితం కొరుచును..
ప్రజల మేల్కొలుపుచుండును..

స్వార్థమన్నది ఎరుగకుండును..
నిస్వార్థమే తన నైజమనును..

కవిగా పురుడోసినను..
కమ్మని కవితలల్లును..
రవిగా ఉదయించినను..
జనుల మేలుకోరును..
కవి,రవిగా వెలుగొందును..
కలకాలం మదిన నిలిచిపోవును..



-పసుల.శంకర్
9542181301

## కన్నీటిని తూడ్చేది ఎవరు

అప్పటి దాకా కనురెప్పల
మాటున కంటి పాపలా
రెక్కల మాటున కోడి పిల్లలా
కొమ్మ చాటునా రెమ్మలా
నులి వెచ్చని అమ్మ ఒడిలో
నవ్వుల పూలను పూయిస్తూ
నాన్న బుజాలపై ఆనందాల
చిరుజల్లును కురిపిస్తూ
సరదాల సందళ్ళు మత్తడి దున్కినయ్

పచ్చని సంసారంలో
పగపట్టిన పాములా
దూసుకొచ్చిన పిడుగులా
కరోనా కొండ చిలువ
తన కౌగిట్లో బంధించి
గాలి తిత్తుల్ని వధించి
వెలుగుతున్న అమ్మా ,నాన్నల
దీపాలను ఆర్పేసింది
నవ్వుల నెలవంకలను
అనాధలుగా మార్చేసింది.

అమ్మ స్పర్శ కరువై నాన్న పిలుపు బరువై
ముద్దు మురిపాలు దూరమై
ఈసడింపుల పర్వాలు మొదలై
తనువంతా చిక్కటి చీకటి కమ్ముకుంది
భవితంతా బంజరు భూమిలా మారింది

కడుపు మాడితే ఆప్యాయ ముద్దను
కలిపి పెట్టేది ఎవరు?
మనసు బరువై కన్నీరు కార్చితే
కొంగు పట్టి తూడ్చేది ఎవరు?
కాలు నొచ్చినా ఏలు నొచ్చినా
కడుపులో పెట్టుకొని చూసుకొనేదెవరు?
నిరాశల చీకట్లో వెలుగు దీపం
వెలిగించేది ఎవరు?
ఆశల మొక్కలను నాటేది ఎవరు?
ధైర్యపు ఇటుకలను పేర్చేది ఎవరు ?

రాత రాసిన బ్రహ్మ ను
కసిగా కాటేసిన కరోనా ను
జిందగీ మొత్తం మన్ను బోస్తూ
మదినిండా మీ జ్ఞాపకాలను తలుచుకుంటూ
గోడపై మీ ఫోటో లను స్మరించుకుంటూ
గడియారం ముల్లు ను నెట్టుకుంటూ
జీవిత శిలువను మోస్తున్నాం
మళ్ళీ మీ కడుపులోనే
పుట్టాలనీ.



-తాటిపాముల రమేష్
7981566031

## నటన

అందరూ
నటనా చతురులే
రాక్షసత్వాన్ని
లోలోన దాచుకుంటూ

సులువే కదా
అభినయించడం
లోకంలో మహా కష్టం
జీవించడమే

నటించకు సుమా
అతిగా
జాగ్రత్త
అదే జీవితమై పోగలదు

ఎంచుకున్న పాత్రను
పోషించక తప్పదు
జీవితమే
ఒక రంగస్థలం

ముఖంపై మాత్రం
నవ్వులు పులుముకున్నా
మదిలోన
సొదలెన్ని ఉన్నా



-అయిత అనిత
8985348424

## నానోలు

ప్రేమ
మోహం
పెళ్లి
బంధం.

ఆవేశం
అనర్థం

శాంతం
రక్షణ

పుడమి
తరగదు
ఆయుష్షు
ఆగదు

మ్రాను
త్యాగం
మనిషి
స్వార్థం

కోపం
నాశనం

శాంతం
మిత్రువు

దేవుడు
నైవేద్యం
గురువు
దక్షిణం

శిల
సహనం
శిల్పి
ఓర్పు

నక్షత్రం
వెలుగు
హరివిల్లు
ఆకర్షణ

ఓటమి
నేర్పిస్తుంది
గెలుపు
నడిపిస్తుంది.

వాగు
చెలిమ
వర్రె
జాలు



-చాపలమహేందర్
9949864152

## ఎన్నెన్నో అందాలు

నిండు సూర్యోదయంతో
కోడి కూతలు
నీటిలో తెలియాడె పద్మాలు
ఆకర్షిస్తున్న ప్రకృతి అందాలు.

మిట్ట మధ్యాహ్న వేళ
చెరువు నీళ్ళతో దాహం తీర్చుకునే దుప్పిలు
ఆకలిని తరిమే ప్రకృతి ఫలాలు
విశ్రాంతినిచ్చే చెట్లనీడలు
ప్రకృతి ప్రసాదించే వరాలు
సూర్యస్త సమయాలు..
కిలకిల నవ్వులతో పక్షులు ఆడే ఆటలు

సాయంకాల సంతోష సంద్రపు అలలు
అందాలపుష్పాల పరిమళం వెదజల్లె ప్రదేశాలు

పండువెన్నెలతో
ఎన్నెన్నో అందాలుఆకాశం విచ్చుకుంటున్న కలువ మొగ్గ
రాత్రి చుక్కలతో భూమంత సంబరం
ప్రకృతి పచ్చగుంటెనే..
మనిషైన జంతువైన
నేలమీద జీవమై బతుకుతది



**-యం. రేణుక**
MPCS మొదటి సంవత్సరం
ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాల
మహబూబ్ నగర్

## మౌనరాగం..??

మహమ్మారి
సృష్టించిన కల్లోలంతో నలువైపులా
దైన్యపరిస్థితులు విస్తరించి
ఆ ఆవరణలో శూన్యం ఆవరించి
దాని శ్వాస ఆగినంత పనయ్యింది
తడబడే అడుగుల విన్యాసాలు
మురిపించే ముద్దు ముచ్చట్లు
అలరించే చిలుకపలుకుల చినుకులు
పడక ఆ ప్రాంగణం తడారిపోయిన
ఎడారే అయ్యింది..
చిలిపి కొట్లాటలు,
చిన్నిచిన్ని పొట్లాటలు
కానరాక ఆట మైదానం
తూటాలు దిగిన యుద్ధమైదానంలా
బోసిపోయి విలవిల్లాడ్తుంది
కరోనా మృత్యు ఘంటికలు
మోగించడంతో అక్కడి గంట
మౌనరాగాన్ని అందుకుంది
సార్..టీచర్.. సరిగమలతో సాగే
అనుబంధాల పల్లవి కాలం చేసిన
ద్రోహానికి గల్లంతయితే
చిన్నారుల చరణకింకిణుల
చిరుసవ్వడులు విన్పించక
ఆ ఆత్మీయ చరణం ఆగిపోయింది
అంతులేని అనురాగంతో
అమ్మల్లా మారి కమ్మని పాఠాల
గోరుముద్దలు తిన్పించే
పంతులమ్మల పాఠాల మిఠాయిపొట్లాల
రుచి గుర్తొచ్చి తరగతి గదులు
ఎదలోతుల్లో బాధతో ఏడుస్తుంటే
వయోభారంతో చిత్తయ్యిన ఛత్తు
కళ్ళ నుండి నీటి చెమ్మ కారుతుంది
బీటలు వారిన గోడల్ని చూస్తే
చిన్నారుల విరహవేదనతో దాని హృదయం
భగ్నమై బ్రద్దలైనట్టుంది
ఇన్నేండ్లలో ఎన్నడు ఇన్ని రోజులు
మూతపడని విద్యాగుడి ఇవ్వాళ
ఎందుకో నేడు తోడు లేక జోడు లేక
కీడుని శంకిస్తుంది
నిజమే..!
నా బడి ఒంటరిదయ్యింది
చిన్నారుల తుంటరి చేష్టలు లేక
చేష్టలూడిపోయి
సమాధి నిశ్శబ్దంతో ఏమి తోచక
కాలంపై భారం వేస్తూ,
బిక్కుబిక్కుమంటూ
కాలం గడుపుతుంది
ఎప్పటికైనా మంచిరోజులు
రాకపోతాయా అని
నిట్టూర్పు విడుస్తూ..



**-సర్ఫరాజ్ అన్వర్**
9440981198

## పచ్చని జ్ఞాపకాల బడి ఒడిలో....

(కథ)

స్వేచ్ఛగా ఆడుతూ పాడుతూ తిరిగే చిలుకను పంజరంలో బంధించినట్లనిపించింది.

వేములవాడ హాస్టల్ లో కాలు పెట్టినప్పుడు సందుగులో ఒక జత బట్టలు అద్దం,దువ్వెన,కొబ్బరి నూనె డబ్బా, బొట్టు, రెండు సబ్బులు నాలుగు పుస్తకాలు, ఓ పన్ను,ఓ తువ్వాల, జంపుకానా, చద్దర్ ఇవే మా ఆస్తి... దానికో తాళం , మొల్దారానికి తోకలా వేలాడే తాళంచెవి.

అప్పుడప్పుడు సీనియర్ల రాగింగ్ ల దోమకాట్లు మూలవాగులో దోస్తులతో ఆటలు పాటలు ముచ్చట్ల ఆక్సిజన్లు

రోడ్డు పక్కన పెద్ద మర్రిచెట్టు బడికి గొడుగులా మహాలక్ష్మి గుడి చుట్టూ ఉన్న తరగతి గదుల నుండి విద్యా సుగంధాలు విరజిల్లేవి అప్పుడప్పుడూ వింత శబ్దాలతో దయ్యాల సృష్టించే విద్యార్థిగణం అటుకుల అప్పాలు ఈయకపోతే మాయమయ్యేవి మంచు గడ్డలా కాళ్ళకూ, చేతులకు దెబ్బలు తాకినా,దులుపుకొని కోతికొమ్మచ్చి ఆటవాడిన బంగారు బాల్యం పైకప్పు రేకులు, కొమ్మలే పతనాలయాలు

నీళ్ళ ట్యాంక్ పక్కన కొత్త విద్యాలయం లోకి ఆనంద సందోహంతో పెట్టెలు నెత్తిలో పెట్టుకొని పరిగెత్తి ప్రవేశించిన మధుర జ్ఞాపకాలు కొత్తలో మాకది మయసభా భవనమే ప్రొద్దునా, సాయంత్రం బంగ్లా మీద పాటల కచేరీలకు, ఆటల పోటీలకు ఆలవాలం కొత్త సినిమా టికెట్ కోసం పోరాటంలాఎండాకాలంలో డాబాపై పండుకునే జాగ కోసం పిండారబోసినట్లుండే చల్లని వెన్నెల వన్నెల్ని చూస్తూ బరువెక్కిన మది గది దూదిపింజలా అయ్యేది

అటు పక్కన ఆట స్థలం లో కబడ్డీ దెబ్బలు చండి, క్రికెట్... ఆటల్లో దెబ్బల బొబ్బలెక్కినా, బట్టలు చినిగినా లెక్క చేయని తనం అన్నపూర్ణే మా వంటశాల ఒక్కోసారి వంటలు బాగా లేనప్పుడు అటుకులు, కారం పొడే పంచభక్ష్యపరమాన్నం.

సాహిత్యం, వ్యాకరణం, తర్కం, తెలుగు,చరిత్ర ... వివిధ పువ్వుల పుష్పాల మకరందాన్ని తెచ్చి పంచిన వాచస్పతులు మా గురువర్యులు.

చెట్టు ఎక్కుతూ, కిటికీలు ఎక్కుతూ సజ్జలెక్కి మేడపైకి వెళ్లడమో సాహస క్రీడ అప్పుడు వాన నీటి పైపుల్ని ఉడుములా పట్టుకొని పాకుతూ పీకివేసిన కిటికీ ఊచల్లోంచి పై గదిలోకి దూకుడమే హీరోయిజం.

సెకండ్ షో సినిమా చూసి వచ్చి వాచ్మెన్ గేటు తీయకుంటే భయం భయంగా నిశ్శబ్దంగా గేటు దూకిన అల్లరి పనులు గుర్తులు హృదయలతల్ని అల్లుకునే ఉన్నాయి

జూనియర్స్ ని తిరగకుండా నైట్ స్టడీస్ పెట్టి ,బెదిరించి చదివించిన సీనియర్స్ మాకు మార్గదర్శకులే ఆ సంప్రదాయాన్ని కొనసాగించాం

సాయంత్రం బడి అయిపోగానే కుర్చీలో కూర్చొని ఆటాపాటా మాటలతో కాలక్షేప కాలాశ్వాన్ని పరిగెత్తించిన బాల్యం మది గదిలో పదిలం

చెమట చిందుతున్నా, నడుస్తూ ప్రతి శ్రావణ మాసంలో నాంపల్లి గుట్టపైనో, అగ్రహారం పచ్చని చెట్ల మధ్యనో వనభోజనాల విహార విహాయస వినోదం

నాంపల్లి గుట్ట నేర్పింది శిక్షణ లేని పర్వతారోహణం గంగమ్మ, లింగమ్మ హోటల్ లో వేడి వేడి బజ్జీలు ఎనర్జీ టీలు బండికి ఇంధనంలా... కొత్త కొత్త పరిచయాల కోసం ఊరంతా పచార్లు గుబాళించని వన్ సైడ్ లవ్వులపువ్వులు ప్రేమామృతాన్ని గ్రోలేవాళ్లు కొందరే మా జీవితాలకు మార్గదర్శి మా కంటి వెలుగీ విద్యాలయం.

(వేములవాడ పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా)



**-ఎర్రోజు వెంకటేశ్వర్లు,**
9492557037

## భారత దేశ బిడ్డగా

గుండెను తట్టి చూసుకుంటే
గుబులు మాయమవుతుంది...
సాంప్రదాయపు సంకెళ్ళతోనే
జీవితం సఫలమవుతుంది ...

అగుపించని ఉమ్మి తుంపరై
ఊపిరులను చేరే కరోనాకు
ఉరిబిగించే ధైర్యం మనలోనే ఉంది..

ప్రాచీన సంస్కృతికి పట్టం కట్టే రోజులు
ముందుతరాలకు వరాలవుతూ
నమస్కారమే సంస్కారమై భాసిల్లుతుంది

శుచీ, శుభ్రతను పాటించే విషయంగా
కడుగుతూ ఉంటే చేతులను
ఏ క్రిమీ దరిచేరలేక జారిపోతుంది...

విషపు కోరలు చాస్తూ వికటాట్టహాసంతో
ప్రపంచదేశాలన్నిటినీ చుట్టేసింది కరోనా
విగత జీవులై ఎందరో...
చితిమంటల కోరలకు బలి అయినారు...

అయినా...
నిరాశను వీడి విశ్వాసం పెంచుకుంటూ
రోదనలతో ఆత్మీయులను పోగొట్టుకున్న ఆప్తులను
ఒకరికి ఒకరై చేయూతని ఇవ్వాలి...
అనాథలైన పసివాళ్లను అక్కున చేర్చుకోవాలి...
ఈ భారతదేశ బిడ్డననే మనోబలంతో
ముందు అడుగు వెయ్యాలి!
స్వచ్ఛమైన వాయువులతో
కరోనాను తిరోగమనం చేయాలి!



**-సుజాత తిమ్మన**
9391341029

## మేం బడిపిల్లలం - కాదుపిడుగులం

మేం పిల్లలం...బడిపిల్లలం
కాదు కాదు మేము పిడుగులం
రేపు మేమే...భావి భారత పౌరులం.

మేం పిల్లలం...బడిపిల్లలం
కాదు కాదు మేము పిడుగులం
రేపు మేమే...అమ్మానాన్నలకు గొడుగులం.

మేం పిల్లలం...బడిపిల్లలం
కాదు కాదు మేము పిడుగులం
రేపు మేమే...అవ్వాతాతలకు అడుగులం.

మేం పిల్లలం...బడిపిల్లలం
కాదు కాదు మేము పిడుగులం
రేపు మేమే...రాజ్యాలనేలే మహారాజులం

మేం పిల్లలం...బడిపిల్లలం
కాదు కాదు మేము పిడుగులం
రేపు మేమే...గూటిలో గువ్వలం
ఘల్లుఘల్లుమనే...కాలి మువ్వలం
ఎగిరే తారాజువ్వలం...రగిలే నిప్పురవ్వలం.

మేం పిల్లలం...బడిపిల్లలం
కాదు కాదు మేము పిడుగులం
ఎందుకు మాపై కోపాలు తాపాలు
రేపు మేమే...ఇంటికి ఆరనిదీపాలం
నీతికి...నిజాయితీకి...నిర్మలత్వానికి
స్వచ్ఛమైన...ప్రేమకు మేమే ప్రతిరూపాలం.

మేం పిల్లలం...బడిపిల్లలం
కాదు కాదు మేము పిడుగులం
కాదు కాదు మేం...కొంపలు కాల్చే కోతులం
రేపు మేమే...బంగారుగుడ్లు పెట్టే బాతులం

మేం పిల్లలం...బడిపిల్లలం
కాదు కాదు మేము పిడుగులం
భోదించాలి చదువులు...మాకు మంచినీతులతో
అందించాలి దీవెనలు....మీ చల్లని చేతులతో



**-పోలయ్య కవి కూకట్లపల్లి**
9110784502

## చినుకొక్కటే

మౌనం దాల్చి
కునుకు తీసే నగరాన్ని
చిలిపిగా పలకరిస్తుంది చినుకు
అర్థరాత్రి స్నానాన్ని కానుక చేస్తుంది.

అగ్గిపెట్టిలాంటి కొంపలో
నిదురరాని కనులపై
వేడిగాలి సంతకాన్ని చెరిపేసిన
చినుకు జావళిగా
చెవిలో జారుతుంటుంది.

జాగాలేని బడుగుజీవి
ఆకాశం పందిరికింద
కలల కొలనులో ఈదుతుంటే
మాత్రం
పోలీసు లాఠీలా విరుచుకుపడి
ఆతని స్వప్న సామ్రాజ్యాన్ని ధ్వంసం చేస్తుంది

అనుభూతికి చివరంచులాంటి
చినుకు సవ్వడిలో
అక్కడే నిలబడి చూసేవాళ్ళుంటారు
జారిపోతూ జాలిగా చూసేవాళ్ళుంటారు
చినుకొక్కటే అనుభూతులే అనేకం.



**-సి.యస్.రాంబాబు**
8374818961

## 'నేను వడ్డించిన రుచులు' అట్లాంటా రచయిత్రి చెప్పిన వంటింటి కథనాలు

పుస్తక సమీక్ష

వంగూరి ఫౌండేషన్ ఆమె అమెరికా 89వ ప్రచురణ, **'నేను వడ్డించిన రుచులు చెప్పిన కథలు'** అట్లాంటా తెలుగు గృహిణి, సంధ్య యల్లాప్రగడ, చదువరులను వంట ఇంటి ప్రయోగశాలకు తీసుకువెళ్తారు. హాస్యం జోడించి ఆహారాన్ని వండి వడ్డించిన ఈ కథనాలు, తెలుగువారి అరిటాకు విందు భోజన జిహ్వాచాపల్యాన్ని కనువిందు చేస్తున్నాయి. భోజనానంతరం సేవించే మీఠాపాన్ యిచ్చే అభిరుచి రచయిత్రి హాస్య వ్యాఖ్యల కారణంగా మనసును పండింపచేస్తాయి. యాంత్రిక జీవితానికి పరిమితమైన ప్రస్తుత సమాజంలో, సంపన్నత సాధించే దిశలో పరుగులెత్తే విద్యాధిక కుటుంబాలు, వంట ఇంట్లో వున్నదానితో సరిపెట్టుకొని రోజులు వెళ్ళబుచ్చుకోవటం సాధారణమైంది. రచయిత్రి, జీవన విధానానికి అవసరమైన ఆరోగ్యాన్ని యిచ్చే పసందైన వంట, ఆనందాన్ని, ఆహ్లాదాన్ని కలిగించే హాస్య ధోరణుల తాలింపుతో వడ్డించటం అభినందనీయం. బుట్టోపాఖ్యానం నుంచి టమాటో స్ప్రింగ్‌రోల్సు వరకు 42 భాగాలు ఆసక్తికరంగా నోరూరిస్తున్నాయి. ఇడ్లీపిండి, ఏదో పచ్చడి కనబడ్డాయి కానీ, పాత చింతకాయ పచ్చడి కనపడటం లేదని సరసిగారి పుస్తక శీర్షపుట చిత్రం, ఆకట్టుకొంటోంది. ఆలుగడ్డతో అగచాట్లు కథనంలో, రచయిత్రి సుమారు శతాబ్ది క్రితం బారిస్టర్ పార్వతీశం లండన్ ప్రయాణంలో ఆవకాయ బాడీ హాస్య కథనం గుర్తు, తళుక్కుమనిపించారు. ప్రతి గృహానికి హృదయం వంటి వంటగదిని అధునాతన మాడ్యులర్‌గా రూపురేఖలు సెట్ చేసుకొన్న 'వంటగది-గుండెకాయ' కథనం విజ్ఞానదాయకంగా ఆలోచింపచేస్తుంది. వివిధ సాంఘిక మాధ్యమాలలో విరివిగా రచనలు కొనసాగిస్తున్న అట్లాంటా రచయిత్రిగా శ్రీమతి సంధ్య ఖండాంతరాలలో తెలుగు వంటకాలు ప్రాభవాన్ని స్పష్టం చేసే, కథనాలను పుస్తకంగా రాయటం తెలుగింటి కుటుంబాలకు, ముఖ్యంగా తెలుగు మహిళలకు ప్రయోజనకర ఇతివృత్తంగా ప్రత్యేక గుర్తింపు లభింపచేస్తోంది. ఊరికే చదవటం వలన నోరూరింపచేయటం రచయిత్రి అభిమతం కాదు. అందువలన వంట ఇంటి ప్రయోగశాలలో తన అనుభవంతో సాధించిన వంటల తయారీ విధానాలను కేవలం లొట్టలేసి సరిపెట్టుకోకుండా నేర్చుకొని, రుచులు ఆస్వాదించమని, వివిధ రుచులు వడ్డించారు. ప్రతి అధ్యాయానికి చిత్రాలతో సరసి పుస్తకానికి భావ గర్భితమైన మనో దర్పణాల వంటి చిత్రాలతో సరసి పుస్తకానికి నిండు చేకూర్చారు. పుస్తకాన్ని ప్రచురించి వెలుగులోకి తెచ్చిన వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా అధినేత వంగూరి చిట్టెన్‌రాజు అభినందనీయులు.




**ప్రతులకు:** వంశీ రామరాజు
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా
హైదరాబాద్
సెల్: +91 98490 23852



**-జయసూర్య**
సెల్: 9440664610

## నా కాళ్ళు

నేను చూశా
మోకాళ్ళ లోతుల్లో కరిగెటాలో
దిగి నాగలి దున్నుతున్న
అన్నలు రైతన్నలను.
నేను చూశా
కన్న కొడుకులున్నా
గంజి మెతుకుల కోసం
ఇల్లు ఇల్లు గేరి గేరి తిరిగి
నడవలేక నడవలేక
నాల్గు కాళ్ళ అవ్వ.
నేను చూశా
వర్షపుధారలో ఎడ్ల బండిపై
నిండు చూలాలు ప్రసవించి
మూర్ఛిలిన దృశ్యాన్ని.
నేను చూశా
తల్లి లేక తండ్రి లేక తిండి లేక
ఏడుస్తూ ఏడుస్తూ
మురిగి కాలువ ప్రక్కన నిద్రిస్తున్న
మూడేళ్ళ పసి బాలికనీ.
నేను చూశా
వలస పోయిన భర్త బంగాళా కింద
పడి తిరిగి రాని లోకానికి పోయాడని
తెలిసి భార్య ఇద్దరు పిల్లలు
పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నది.
నేను చూశా
తల్లిదండ్రులు బ్రతికి ఉండగానే ఆస్తి కోసం
పానం తీసిన కసాయి కొడుకులను



**-బాటసారి జయ హనుమంత్ నాయక్**
9440174050

## శ్వాసకు ఊపిరి తను

మరణ కుంపటి ఆహ్వానించినా
రక్తం ధారలై ప్రవహించినా
తన్నుకొస్తున్న కంటిచెమ్మను తొక్కిపట్టి
బిడ్డ ఏడుపు పాటతో
పులకించిపోయే తన్మయత్వం తను..!

తన కొవ్వొత్తిలా కరుగుతూ
బిడ్డల జీవితంలో కాంతిరేఖయై
వారి ఆనందాన్ని దోసిట పట్టి
భూలోకమంతా పందిరి వేసి
పరవశించిపోయే నిర్భయత్వం తను..!

వెలుగులను వెదజల్లే కల్పవృక్షమై
ఆకాశమంత ఆత్మవిశ్వాసాన్ని
అంతులేని భరోసాను ఇచ్చి
ఎదలోతుల్లో మధుర స్వరాలను
పలికించే మానవత్వం తను..!

పాలలోని స్వచ్ఛతలా
ప్రకృతిలోని పచ్చదనంలా
పవిత్రమైనది అమ్మతనము
ఆమె నా జన్మకు మూలము
అమ్మే నా శ్వాసకు ఊపిరి ..!



**-పిల్లి.హజరత్తయ్య**
9848606573

## నానీలు

మేఘం
నీళ్లు ఓసుకుంది
అవని ఒడిలో
ప్రసరించాలని

జోరు వానకు
పంట చెరువాయే
రైతు గాదె లో
కన్నీరే నిండే

నల్లని మేఘం
నీల్లాడింది
పుడమి
పచ్చని కోక చుట్టింది

రైతు కన్నీటి
వరదలో
చేతికొచ్చిన చేనంత
కొట్టుకుపోయింది



**-చాపల మహేందర్**
9949864152

## నువ్వు పాడుతావు హాయిగా!

నీకు నాకు ఎంత వ్యత్యాసమే కోయిలా...
నువ్వు పాడుతావు హాయిగా!

నేను ఆలోచిస్తూ నిత్యసంఘర్షణలతో ఇలా
నువ్వు కొమ్మ కొమ్మన విహరిస్తావు
నేను కర్మ కర్మ అంటూ నడుస్తాను

నీకు నాకు ఎంత వ్యత్యాసమే కోయిలా...
నువ్వు పాడుతావు హాయిగా!

కుహూ కుహూ రాగంలో లోకాన్నే మెల్కొల్పుతావు
నేను ఇంకా నిద్రిస్తూనే కాలం గడుపుతున్నాను
నువ్వు చీకూ చింతా లేని దానివి
ఎక్కడికైనా వెళ్లి నీ స్వరంతో మురిపించగలవు

నీకు నాకు ఎంత వ్యత్యాసమే కోయిలా...
నువ్వు పాడుతావు హాయిగా!

నువ్వు నీ పాటికి ఎగిరి ఎగిరి పోతావ్
నేను ఎచ్చటికి వెళ్ళినా సందేహపడుతూ ఉంటాను

నీతో కలిసి నాకు విహంగ విహారం చేయాలని ఉన్నా
నా అడుగు ముందుకు పడలేదు సుమీ...!
నీ వలె నాకు పాడాలని ఉన్నా
గొంతు తడబడి దిక్కులు చూస్తున్నా
నీకు నాకు ఎంత వ్యత్యాసమే కోయిలా...
నువ్వు పాడుతావు హాయిగా!

నల్లని రూపం నీదే అయినా
నీ మనసు ఎంత స్వచ్ఛమైనదో నీ పాటే చెబుతుంది
నేను ఉన్న దానితో తృప్తి లేక
ఇంకా దేనికో ఆరాట పడ్తున్నాను
చిత్రం కదా ఓ చిన్నారి కోయిలా
నాకు నీకు ఎందుకు ఈ వ్యత్యాసం చెప్పవే
నీ కమ్మని పాటతో ...
నా జీవన మార్గాన్ని చూపుతావు కదూ ..!

**-సహని**
8074318053

## చాయ గిన్నె కష్టాలు

(కథ)

ప్రతీ రోజూ నరకమే నాకు..పొద్దు లేదు మాపు లేదు...దుక్కమొస్తుంది...

ఎందో పడి పోయినట్టు గా ఇంటామె 5 గొట్టంగ లేస్తది...లేసుడు తోనే పండ్లు తోమి వంటింట్ల కొచ్చి నా కోసం ఎటుకుతది.... ముద్దుగ కోపెడు చిక్కగ చాయ వెట్కొనీ కుర్చీ ల గుసోని బుర్ర బుర్ర తాగుతది....

ఇగ తానాని కి వొయ్యి వచ్చే వరకు వాళ్ళాయన లేషి పేపరు సదువు కుంట " ఇగో గింత శాయ వెట్టు" అంటడు.

"ఆ ! గట్లే పెడ్తున్న..అని మల్ల నన్ను పీసు వెట్టి తోమి చాయ్ వెట్టి.. కోపెడు ఆయనకు..మిగిలింది మల్ల తాగుతది గుట్ట గుట్ట....

ఇగ గా పోరగాండ్లు లేశీ..." అమ్మా ! చాయ్ వెట్టినవా " అంటరు...

"పెడ్తున్న " అన్ని మల్ల తోముతది నన్ను....

"అమ్మయ్య ! ఇగ రెస్ట్ దీసుకుంట అని అనుకునే వరకు...

"అమ్మ గారు! గింత శా వట్టు వొయ్య రాదు నెత్తి బాగ నొస్తంది" అనే...

నీ పాడు గాను నన్ను బత్క నియ్యరా ఉల్లో!

మల్ల నన్ను పొయ్యి మీద వెట్టుడే...

ఇగ ఇంట్ల అందరు ఏతోల్లు అటు వోయింరు.... గూట్లే వొయ్యి పంట..

"ట్రింగ్..ట్రింగ్..."

ఎవలో ఫోన్ జేశిరి...

ఇంటామె" అలో! ఎవలు....కిందింటి పంకజమా! వొస్తావు..దా! గట్ల అడిగుడు ఎందుకు! రావాలి బాజాప్తగ...చాయ వెట్కొని తాగుదాము"..

వామ్మో! నన్ను చంపుతావే! నీ చాయ్ పాడు గాను..

రానే వచ్చే గామె! ముద్దుగ సోపాల గుసొని ఇక ఈకలు..పక పకలు...ఎల్లి మీద బల్లి వడే..బల్లి మీద ఎల్లి వడే అని...నన్ను గుంజుకొచ్చి పొయ్యి మీద వెట్టి చాయ్ వెట్కోనీ తాగిరి...

గిట్ల నన్ను తోమి తోమి సంపుతున్నరు...బ్రమ్మ తానికి వొయిన కష్టం జెప్పుకో నీకి...

అయ్యో! అనంగనే....

ఎవరక్కడ ఇగో చాయ గిన్నె వొచ్చింది..నాలుగు తలకాయలు నొస్తున్నయి...పెద్ద కోపెడు చాయ వేట్టుండి అన్నడు....ఇగ ఎవలకూ జెప్పాలే...

సంతోష మొచ్చినా దుక్క మొచ్చినా చాయ నే నట..పొరగాండ్లకు పరిచ్చలు వొస్తే నిద్ర రాకుం ట చాయ నే...

గీతలు వడ్డయి పెయ్యంత...పొయ్యి మీద పెట్టి పెట్టీ.. ముడ్డి మండుతుంది....

జెర్ర న్యాయం జెప్పుర్రి !



**-లక్ష్మి మదన్**
9959186838

## ఎవరి కోసం ఆగకు...

వెనకడుగు వెయ్యకు..
కాలం నీకోసం ఎన్నడూ ఆగదు..

ఘడియలు నీకోసం ఎదురు చూడవు..
నీ ఇంటి గడప దాటితేనే అనుకున్నది సాధించగలవు..

రాత్రి పగల్లు వస్తుంటాయి పోతూంటాయి..
సూర్యచంద్రుల గమనం నిరంతరం.. నిర్విరామం..
సూర్యుడు ప్రకాశించటం ఆపడు..
చంద్రుడు వెన్నెలను కురిపించడం మానడు..

రావాల్సిన మబ్బులు వచ్చి ధారాళంగా
వర్షాన్ని కుమ్మరించి పోతాయి..
వసంతకాలం ఏ యేడైనా
ఆగిపోయిందనే సంగతి ఎఱుకేనా..
ప్రకృతి ప్రయాణం నిరంతరం నిర్విరామం..
మరి నీవెందుకు ఆగిపోయినావ్..

ఎన్నడూ ఆగిపోకు.
ఎప్పుడూ అలసిపోకు..
నీకోసం నువ్వు మాత్రమే సాగిపో

నీలో కసిలేకపోతే పంచభూతాలు సైతం
నీకు తోడు రావు...
ఎవరికోసం ఈ వెనకడుగు..
ఎదలో రగిలే కసితో అడుగేయ్..
వెనకడుగు వేసినా వెనకనే ఉండిపోకు ..
వెనక్కి వంగిన విల్లు నుంచొచ్చే బాణంలా దూసుకుపో..
పరిగెత్తే కాలంలో కదలకుండా నిల్చుండి పోతావా..
కాలంతో పోటీ పడు... కాలాన్ని మించి పరుగెత్తు..
పరిగెత్తితేనే జింక ప్రాణాలు నిలుస్తాయి..
పరుగాపావో కాలమనే పులి నిన్ను కబలిస్తుంది..
కష్టాన్ని నమ్ముకో.. కాలం నిన్ను గెలిపిస్తుంది.

ఎన్నడూ ఆగకు.. ఎవరి కోసం ఆగకు..
గెలిచేదాకా నిలవకు... గెలిస్తేనే నిలుస్తావ్..
గుర్తుంచుకో...!
గెలిచినా నీ కృషి ఆపకూ...



**-స్వేచ్ఛావి**
8185062909

## క్షణభంగుర జీవనం..!

గుక్కెడు ముర్రు పాలకు
చెంచెడు తులసి తీర్థానికి నడుమ
అవిశ్రాంత ప్రయాణమే జీవితం !

కళ్లు తెరవడానికి
మూయడానికి నడుమ
నడిచేదే క్షణభంగుర జీవితం !

పిరికెడు ఆశలకు
దోసెడు అడియాసలకు నడుమ
కదిలే అలల లయలేగా జీవితం !

దుఃఖ సాగరానికి
ఆనంద బాష్ప జలపాతానికి
నడుమ సయ్యాటేగా జీవితం !

తాత్కాలిక మెలుకువకు
శాశ్విత మౌన నిద్రకు నడుమ
క్షణాలేగా తీపి చేదుల గురుతులు !

ఏడ్వటానికి
ఏడ్పించడానికి నడుమ
నడిచేదే కదా ఈ జగన్నాటకం !

గొంతు పెకలడానికి
స్వర తలుపులు మూయడానికి
నడుమ సాగడమేగా ముచ్చట్ల జీవితం !

కష్టాల కడలికి
సుఖ తీరాలకు నడుమ
ప్రవాహానికి ఎదురీతేగా జీవన క్రీడ !

బొడ్డు పేగు తుంచడానికి
మె?లతాడు/పసుపుతాడు తెంచడానికి
నడుమ చదరంగమే కదా జీవిత గాథ !

చంటోడి తొలి అడుగులకు
వయోవృద్ధుడి తడబడే అడుగుల
నడుమ పాదయాత్రేగా జీవన పయనం !

నీతి నియమాలకు
అనైతిక రోత పనులకు
నడుమ ఘర్షనే కదా జీవన గమనం !

విజయ తీరాలకు
అపజయాల అంధకారాలకు
నడుమ దోబూచులాటేగా జీవనయానం !

చిక్కటి చీకటికి
తేజోమయ వెలుగులకు
నడుమ నలగడమేగా బడుగుల జీవన యానం



**- డా|| బుర్ర మధుసూదన్ రెడ్డి**
99497 00037

## జీవిత పయనం

పదుగురితో కలిసి
పయనిస్తే నే కదా
మనకు గుర్తింపు ఉండేది,
కష్టించి కడవరకూ
జీవనయానం చేస్తేనే కదా
మన జన్మకు సార్ధకత కలిగేది,
మన ఉనికి తెలియాలంటే
స్నేహ బంధం గొప్పది,
పదుగురిని ప్రోదుచేసు
కుంటేనే కదా...
రేపటి మన కష్ట సుఖాల్లో
తోడూ నీడగా ఉండేది,
ఒంటరి పయనం
ప్రమాదకరం,
మాటా మంతీ లేని
జీవితం సంతకం లేని
ప్రాంసరీ నోటు లాంటిది,
నా జీవిత పయనం
పదుగురికిఆదర్శం కావాలి,



**-రాయవరపు సరస్వతి**
9885656356

## ఆరోగ్య ఖని !

మనిషిమొఖం ఇపుడు
మన్యాది మంచుశిలై
కన్నీటి బిందువులుగా
రేయింబవళ్ళు ద్రవిస్తోంది.

ఉదయాన్నే
ఊపిరిసడిని కాళ్లతో
బంధించి నగరారణ్యంలోకి
జారవిడిచింది ఆత్మీయత ఫీనిక్స్ !

పాదాలను
ఆత్రపు రైలుపట్టాలపై
ఎక్కించి,ఆ ఆరోగ్య ఖని !

ముంగిట వాలేను
కానీ అప్పటికే ..
ఓ మధ్యతరగతి ఆరోగ్యాన్ని
పేదరికం పీనుగుగా సింగారించి !
చివరివిందు ఎట్లా వదిలేదంటూ..?
గోలెడుతున్నయి ఆసుపత్రి
పీతిరిగద్దలు



**-కృష్ణ గుగులోత్**
9618096173

## యువతా!మేలుకో..

యువత మేలుకోవాలి
ప్రగతి వైపు నడవాలి

వ్యసనాలకు బానిసలు కావద్దు
కన్నవారి ఆశలను కూల్చవద్దు
చదువును అశ్రద్ధ చేయవద్దు
చదువే మీ భవితకు తొలిపొద్దు
ఓ యువతా మేలుకో
మీ దేశాన్ని ఏలుకో..
వినోదాలు చూపేది మీరే
విప్లవాలు రేపేది మీరే
మీ ఆలోచన గతి తప్పితే వినాశనం
మీ ఆలోచన జనం మెచ్చితే అభ్యుదయం
ఓ యువతా మేలుకో
మీ దేశాన్ని ఏలుకో..
భావిభారత పాలకులు మీరే
భారతదేశ రక్షకులు మేరే
అవినీతిని అంతం చేయాలి మీరు
అన్యాయాన్ని ఎదిరించాలి మీరు
ఓ యువతా మేలుకో
మీ దేశాన్ని ఏలుకో



**-బూర దేవానందం**
9494996143.

## ఆమెకు సాటి ఆమే

ఆమె అవనిలో సగం
ఆమె ఆకాశంలో సగం,
ఆమె లేనిదే ప్రపంచం లేదు
ఆమె లేనిదే మనకు పూట గడవదు...!

ఆమె సృష్టికి మూలం
ఆమె సహనం వ్యక్తిత్వం అద్భుతం,
ఆమె గృహిణియే కాక
అన్ని రంగాల్లో ప్రతిభావంతం!

ఆమె తల్లిగా లాలించినా,
సోదరిగా తోడుండినా,
భార్యగా బాగోగులు చూసినా,
అన్ని భారాలను మోసినా,
ప్రతి పనిలో చేదోడు
వాదోడుగా నిలిచినా
సర్వ త్యాగాలకు ప్రతీకం.,
ఆత్మీయ అనుబంధాలకు ప్రత్యేకం!

లాలనలో పాలనలో
ఆమెకు ఆమె సాటి
సేవా తాత్పర్యాలకు పరిపాటి,
ప్రతిభా పాటవాలకు ఘనాపాటి
ఓర్పు సహనాలకు మేటి!



**-ఎన్.. రాజేష్**
9849335757

## ఆత్మ విశ్వాస పవనం..

పరుగెత్తుతున్న కాలం
గల్లా పట్టుకుని వెనక్కి నెట్టి
ఆత్మవిశ్వాసాన్ని కొమ్మల్లో
నుండి వేర్లలోకి చొప్పించి
గాల్లో నిశ్శబ్ద భయతరంగాల్ని
మెల్లిగా పంపిస్తూ
క్రమక్రమంగా కఠోరంగా మారుతూ
తన వాటం చూపుతూ
హఠం చేస్తూ హాహాకారాల
పర్వాల పరంపరలు సృష్టిస్తూ..
భయవిహ్వల దృక్కులతో
నలుదిక్కుల్ని కంపింపజేస్తూ
ఆత్మస్థైర్యపు వెలుతురు
సన్నగిల్లిన నిశీధిలో
చీకటి భూతంలా వెంటాడుతూ
రక్కసిలా మారి అక్కసును
వెళ్ళగక్కుతున్న గుంటనక్కకి
చుక్కలు చూయించడానికి..
భయపెడుతున్న కాలానికి
సవాల్ విసిరే
ఆత్మవిశ్వాసపు శ్వాస పవనం,
విశ్వరూపం చూపుతూ
వికట్టహాసం చేస్తూ దమ్ము
చూపుతున్న మహమ్మారి
కొమ్ములు వంచే మంత్రం,
చిందులు తొక్కుతూ
మృత్యు విందు చేసుకుంటున్న
రాక్షస రాబందు రెక్కలు
తెంచే పాశుపాతాస్త్రం
టీకా మందు..

**-సర్ఫరాజ్ అన్వర్.**
9440981198

## నానీలు

చెట్టు ఊగుతుంది
గాలి వీస్తే
మనిషి చలించడే
మనిషి వస్తే..?

వేచి ఉండటం
ఒక్కోసారి ఎంత విసుగో
కొన్నిసార్లు
ఎంత మధురమో!

నీ మాట
ఒకరికి వెలుగు అవ్వాలి
నీ బాట
మరెందరో్కి స్ఫూర్తి అవ్వాలి

కల్మషం ఎరుగని
మల్లెల ప్రశ్న
మనుషులు
తమలా ఎందుకుండరని?



**-యలమర్తి అనూరాధ**
చరవాణి:9247260206

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 307వ రోజు 'వంటిల్లు' అనే అంశంపై పలువురుకవులు తమ కవితలను పంచుకున్నారు. 'వంటిల్లు' అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం.. - సంపాదకులు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం
ఏకాంశ కవిత్వం నిర్వహణ:
**డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు,** 9441046839



## వంటిల్లు

వంటింటికి మహారాణి అన్నా
వంటింటి కుందేలు అన్నా
మహిళను పొగుడుతున్నారా
చిన్నతనం చేస్తున్నారా అర్థం కాదు.
అంతస్తుల ఇండ్ల నిర్మాణం
అంతంత మాత్రమే ఉన్నప్పుడు
పెంకుటింట్లోనో
మిద్దెల ఇండ్లలోనో గుడిసెల్లోనో
పొయ్యిరాళ్లకు ఒకపక్క నీళ్ల కుండతో
కట్టెలపొయ్యిపై వంట చేసిన
నాటి కాలం దాటి.
అనేక అంతస్తుల అపార్టుమెంట్లలో
అత్యాధునిక వంట గదితో
శ్రమను తగ్గించే నవీన పరికరాలు
సౌకర్యాల సౌలభ్యంతో వంట చేయడం
అనుభవం లేనివారికీ చేసింది ఎంతో సులభం
ఔషధాల ఇల్లు కాస్తా
రుచుల ప్రాధాన్యతా కేంద్రమైంది
శ్రమలేని సులభ వంటల విధానం మాత్రం
సమయాన్ని ఆదా చేసింది.

-నాగిరెడ్డి అరుణ జ్యోతి,
9966181561

## నాలుగు తరాల వంటింటి కథ

కట్టెల పొయ్యిపై
మట్టి కుండల్లో
తడిబట్టల
మడివంటలు
మా అమ్మమ్మ తరం !
బొగ్గుల కుంపట్లో
ఇత్తడి పాత్రల్లో
పొడి బట్టల
శుచి వంటలు
మా అమ్మ తరం!
వత్తుల స్టౌపై
సత్తు గిన్నెల్లో
పరుగులు పెడుతూ
హడావుడి వంటలు
నిన్నటి తరం !.
గ్యాస్ స్టౌపై
స్టీలు బొచ్చెల్లో
మాక్సీ ధరించి
యూ ట్యూబ్ వంటలు
నేటి తరం !.
తరాలు మారినా
అంతరాలు మారినా
రుచులు మారినా
అభిరుచులు మారినా
మారనిదల్లా వంటింటి కాన్సెప్ట్ !.
కత్తి పీటా
పోపుల డబ్బా
వంటింటికి
రెండు కళ్లు !.
పప్పు దినుసులు
కూరగాయలు
వంటింటికి చేరే
నిత్య అతిథులు !.
చెవులూరించే
వంటకాలకు
కేర్ ఆఫ్ అడ్రస్
వంటిల్లే కదా !.

- రామకృష్ణ చంద్రమౌళి,
9666656687

## వంటిల్లు

కట్టెలు కాలు నచటే
కడుపు నింపునదే
పొగలు కక్కుతున్న
వంటయే
పొలతి వడ్డించగ
పోవు నాకలి బాధ
పోపుల పెట్టె
ధనాగారమే!
పొందికైన వైద్యశాలయదియే!
వంటయిల్లే
వార్చిన బువ్వ
పిల్ల పాప యువత ముదుసలికదే
కన్నతల్లి
పోయే వరకు
తాను కాలుతూ
మన కడుపు ఆకలి మంటలార్పు
అన్నపూర్ణ
అదే మూలికల నిధి
పెన్నిధి
అదే సన్నిధి
వంటయిల్లు కాయం పడిపోయే వరకు
వదలని
అన్నపు సంబంధం
అనుబంధమై.

- దేశపతి కృష్ణమూర్తి,
9492867366

## పాకశాల

ఇల్లు ఎంత విశాలమైనా
గృహము ఎంత ఇరుకైనా
ఇంటి పడక గదులెన్నైనా
ఉన్నది పూరి పాకయినా
అమెరికా ఐనా అనకాపల్లి ఐనా
వంటిల్లు లేని వసతి ఉంటుందా.
ఉదయం నిద్ర లేచింది మొదలు
రాత్రి పడుకునే వరకు
వంటిల్లే ఇంటికి ఆయువు పట్టు
లేవగానే కాఫీ కోసం వంటిల్లు
అల్పాహారం, భోజనం, చిరుతిళ్ళు
తేనీరు, మంచినీరు అన్నింటికీ వంటిల్లు.
పప్పులు, ఉప్పులు, పోపు దినుసులు
బియ్యం, బెల్లం, కూరలు, తైలాలు
పొందికగా అమర్చిన వంటిల్లు
నోరూరించే రుచులకు పుట్టిల్లు
శుభ్రమైన ఇంటి పాకశాల
ఇంతి అభిరుచని వేరే చెప్పాలా!.

-జె.వి.కుమార్ చేపూరి,
96407 12062

## మహిమాన్విత గది

వ్యాధిగ్రస్తమైన జిహ్వాకు
మందులిచ్చే ఆసుపత్రి
సరియైన మోతాదులో వాడితే ఆనందం
మోతాదులో తేడాలుంటే
మంచమెక్కడం ఖాయం.
ఆ రాజ్యానికి
మగవాడెప్పుడూ సామంతరాజే
సాయమందించేవాడే.
అతివల సామ్రాజ్యం
అది వారి అతి ప్రేమ ప్రదేశం..
అన్నీ ముందే ఉన్నా
ఏ వస్తువు దొరకదు
వాళ్ళ అనుమతుంటేనే
మగ కంటికి కనపడు.
నచ్చిన వారికైతే
అమృతాన్నే ఇవ్వగలదు
నచ్చని వారికి
హాలాహలాన్ని మరిపించ గలదు.
వండిన వారి మానసిక స్థితి తెలిపే శాస్త్రవేత్తే
ఎందరి కైనా కడుపు నింపే అక్షయపాత్రే
ప్రాణికి గుండె ఎంత ముఖ్యమో
ఇంటికి వంటిల్లు రెండాకులు ఎక్కువే.
కాదూ కూడదంటే గుండె పోటు సహజమే
లాకర్లు, కోడు నెంబర్లు లేని ఖజానా శాఖ
ఎన్నటికీ తరగని నిధి ఉన్న ప్రదేశమే.
కోడలు వచ్చినా అత్త దిగని కుర్చీ అదే
దిగినా, ఆదేశాలు సూచనలు శాసించే
నియంతే
ఒక్కసారి మెచ్చుకుంటే
ఇల్లు మొత్తం ఘుమఘుమలే
కాదని అంటే ప్రతి వంటకం బొగ్గే.
టీకాఫీలు కావాలన్నా
ఆ గది ముందే నిరీక్షణ
అది వంటగది..
మా ఇంటి మహిమాన్విత గుండెగది.

-గుర్రాల వేంకటేశ్వర్లు,
94909 18014

## వంటింట్లో ఇల్లాలు

వంటిల్లో అందాల ఇల్లాలు
ప్రేమానురాగాలతో పాకాలు
రంగరించి మనకి పెడుతుంటే
అమృతతుల్యమే కదా మనజిహ్వ.
వంటింట్లో అందాల అమరికలు
వంటింటి తీనె నున్ననైన నాపరాయి
ఊరగాయల జాడీలు నీళ్ల బిందెలు
పప్పుల డబ్బాలు పోపుల పెట్టెలు
కూరలబుట్టలు
చాకులూ చెంచాల దొంతర.
రక రకాల గిన్నెలు
రక రకాల గ్లాసులు
వంటబియ్యము నూక పిండి బెల్లం
గ్యాస్ బండ తరుగువంటసాధనాలు
అబ్బోబ్బో వంటింటి అందమే అందం.
ఆగ్నేయంలో గ్యాస్ స్టవ్ వండి ఇస్తుంటే
ఈశాన్యంలో దేవుని మందిరం
మనల్ని రక్షిస్తూ కనువిందు చేస్తుంటే
ఫ్రిజ్ నిండా రకరకాల ఫలహారాలు
చల్లటి పానీయాలు కూలింగ్ వాటర్
హాట్ హాట్ గా కూల్ కూల్ గా భుక్తి భక్తి
వంటింటి అందమే అందం
కడుపు నింపే వంటిల్లు
ఆ వంటింట్లో మన ఇల్లాలుచేసే
ఘుమఘుమలతో కడుపునింపుతుంటే
ఆ ఇల్లాలు మనకి రోజూ ప్రియురాలేకదా!
వంటింట్లో ఇల్లాలు ఇష్టమైన ప్రియురాలే!.

-తాతపూడి సోమశేఖర శర్మ,
8328079336

## ప్రయోగశాల

వంటిల్లు
నాకు నచ్చిన ప్రదేశం
వంటకాలకు పుట్టిల్లు
మా వంటిల్లు
ఎన్నో ప్రయోగాలు చేసే ప్రయోగశాల
హరివిల్లు లో రంగులతో
నోరూరించే వంటకాలు
మగడు మెచ్చిన వంట
ఇల్లాలి పాకం
వంటింట్లో ఘుమఘుమలు
పాత్రల సవ్వడులు
అమ్మ చేతి గాజుల సరిగమలు
మా ఇంద్రియాలపై చేసే ఇంద్రజాలం
కమ్మని వంటలు
రమ్మని పిలిచాయి
అమ్మా!
నోరూరించక మిఠాయిలు
త్వరగా ఇచ్చెయ్??

-శ్రీ కళ,
7893087349

## దీక్షల మోక్షశాల

ఆకలిదప్పులదీర్చుచు
సాకెడు కరుణామృతమ్ము శ్యామల నెలవై
పీకల దాకను మ్రింగక
పాకము షడ్రుచుల పెట్టె వంటలయిల్లే!!
గంజున నూకలు కరువై
గంజియె పరమాన్నమనుచు
కడుపుల నింపన్
సంజీవని యన్నపూర్ణకు
వింజామర వీచు సతికి వేదికనిదియే!!
ఎన్నిరకమ్ముల రుచులో
మన్నికతో వాసనలను మాన్యత చేయన్
పున్నెపు పోపుల డబ్బా
వన్నెల వంటిల్లు శోభ వర్ధించుటయా!!
లెక్క లేనన్ని వంటల నక్కజముగ
సక్కనైనట్టు చేయించు చాల ప్రీతి
ప్రక్క వారిని కాపాడు పాకశాల
మొక్కవోనట్టి దీక్షల మోక్షశాల!!.

-మాడుగుల నారాయణ మూర్తి,
9441139106

## ఆరోగ్య శాఖ

ఇంటింటికీ అమ్మే ఆరోగ్య శాఖ మంత్రి
పోపులపెట్టెలో దాగివున్న ధన్వంతరీ.
పసుపు అల్లం వెల్లుల్లి గుణకారి
చిన్న చిన్న జబ్బులకు ఉపకారి
కట్టెల పొయ్యైనా నిత్యాగ్ని హోత్రం
కాలానుగుణంగా ఆరోగ్య సూత్రం.
మసాలా వాడకం తెలిసిన చేయి
ఇంటికి పడకేసే రోగాన్ని ఆపే ఆయా
జిలకరలో ఉండే శక్తి తెలుసు
మెంతుల్లోని వైద్యున్ని అందించు.
అనారోగ్యచింతలు దూరం చేసే యోగి
ఆకలికి ఆరు రుచులు అందించే దేవి.
రుతువు మార్పులకు సంజీవని
కాలానికి అద్దం పట్టే ఆరోగ్య లక్ష్మి.
చిరు ధాన్యాల వాడకానికి కూడికలేసి
కుటుంబ సంరక్షణకు చిట్కాలు హెచ్చవేసే.
అశ్విని దేవతలు పంపిన ఆయుర్వేదమ్మ
భారతీయ వంటింటికి రేలపూలమ్మ
పండగలకు పిండి వంటలమ్మ
బతుకమ్మ నవరాత్రులకు సత్తు అమ్మ.
పూల వంటలకు
కూరాకు పచ్చళ్ళకు నెలవంక
ఔషధాల గుణాల విలువలు పెంచే
అమృత మూర్తి.
ఆరోగ్య సాధానికి డాక్టరేట్
ఆహార వేదానికి పేటెంట్.
భారతీయ వంటలంటే
పెరటితోటల సమ్మేళనం
మన వంటిల్లే సరిగా వాడుకుంటే
త్రిదోషహరం
(××త్రి దోషాలు= వాతం పిత్తం కఫం.
ఈ దోషాలు శరీరం లో ప్రకోపించినపుడు తత్సంబంధ అనారోగ్య సూచనలు కనిపిస్తాయి. త్రి ఫల సేవనం సమతాస్థితి కారకం).

-ఏడెల్లి రాములు,
9494800454

## అక్షయపాత్ర

అన్నపూర్ణయై అన్నప్రసాదాన్నిచ్చే వంటిల్లు
కోరినది అనుగ్రహించే అక్షయపాత్రై భాసిల్లు
చెవులూరించే పలు రుచులకు పొదరిల్లు
సకల ఆయురారోగ్యాలకు నెలవై విలసిల్లు.
ఇంటిల్లిపాది ఆరోగ్యానికి మూలమై శోభిల్లు
ఔషధ వనరులకు నిలయమైన పుట్టిల్లు
ఇక అనారోగ్యాలన్నింటికీ కాలం చెల్లు
ప్రతిఇంటా వంటిల్లు ప్రత్యేకంగా అలరిల్లు
మహిళా సామ్రాజ్య అందాల హరివిల్లు
అందిస్తుంది ప్రశంసల విరిజల్లు.

- ఎస్. రత్నలక్ష్మి,
8331930635

# విద్యార్థి- ఉపాధ్యాయుడు-సమాజం

విద్యార్థి భవిష్యత్తుకు పునాది లాంటి వాడు ఉపాధ్యాయుడు. ఉపాధ్యాయుడు విజ్ఞాన సిరి జాతిని మలిచే శిల్పివృత్తిపట్ల అంకిత భావం కలిగి విద్యార్థుల శారీరక మానసిక లక్షణాలను పెంపొందించే రీతిలో బోధన కొనసాగించాలి. పాఠశాల సమాజం ఈ రెండు రెండు కళ్లుగా భావించి విద్యార్థుల ప్రతినిధిగా సమాజంలో వెలగాలి. సమాజమంతా విలువలను నింపే విధంగా ప్రయత్నించినప్పుడు ఉపాధ్యాయ వృత్తి పరమైన విలువలు కూడా పెరిగి సమాజం పటిష్టం అవుతుంది నేటి ఆధునిక యుగంలో ఉపాధ్యాయులు సమాజానికి దిక్సూచిజాతి నిర్మాణానికి పాటుపడే మేధావి ఉపాధ్యాయుని వృత్తిపరమైన నిబద్ధత సామాజిక ఆర్థిక అభివృద్ధికి బాసటగా నిలుస్తుంది. సమాజం యొక్క మానసిక స్థితి కన్నా ఉన్నతమైన పరిణతి చెందిన మనో వికాసాన్ని కలిగిన ఉపాధ్యాయులు ఉన్న సమాజం కూడా పురోగమిస్తూనే ఉంటుంది. విద్యార్థులు పాజిటివ్ థింకింగ్ అభివృద్ధి కావడానికి శాస్త్రీయ వైఖరి అవగాహన కలిగి ఉండాలి సమాజం కూడా ఉపాధ్యాయుని సంక్షేమం గురించి ఆలోచించాలి. సామాజిక ఆర్థిక భద్రతను ప్రభుత్వాలు కల్పించాలి. అజ్ఞాన తిమిరంలో విజ్ఞాన కిరణాలు ప్రసరింప చేయువాడే ఉపాధ్యాయుడు. నేడు సమాజానికి డబ్బు పట్ల వ్యామోహం బాగా పెరిగింది. ఆర్థికంగా ఉపాధ్యాయుడు కింద స్థాయి వాడు కావున నైతిక బాధ్యత వహించాల్సిన సమాజం గుర్తించటం లేదు. ఉపాధ్యాయుడు సమాజంలో అంతర్భాగమే సమాజాన్ని అత్యంత ప్రభావితంగా భావించడంలో అతనికి అతనే సాటి ప్రవృత్తి రీత్యా కాకుండా చాలామంది ఉపాధ్యాయ పదవిని వృత్తిలా స్వీకరించారు. నేడు విద్య యొక్క అర్థం పరమార్థం మారిపోయింది. విలువలు లేని ఎడారి లాంటి ఈ సమాజంలో తరగతిగది ఓయాసిస్ లాంటిది. వృత్తి నిబద్ధత సామాజిక బాధ్యత కర్తవ్యం నేటి ఉపాధ్యాయులపై ఉన్నది విద్యార్థిని అన్ని విధాల వికాసం కలిగించి మూర్తిమత్వాన్ని పెంపొందించ గలిగేది ఉపాధ్యాయుడు. ఉపాధ్యాయుని వృత్తిపరమైన విలువలపై సమాజం ప్రభావం ఎంతైన ఉంటుంది సమాజంలో ఉపాధ్యాయుని యొక్క విలువలు పెరగాలంటే వృత్తి నిబద్ధతతో పాటు సామాజిక బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలి. మానవతా విలువలు నశించి మానవత్వం మంట కలిసి పోతున్న ఈ రోజుల్లో ఉపాధ్యాయుడు ఒక్కడే సమాజంలో సరైన మార్పులు చేయగలడు ఉపాధ్యాయులు పవిత్రమైన విజ్ఞాన గని లాంటివారు. ప్రణాళికాబద్ధంగా వృత్తిపరంగా వృత్తిని గౌరవించే వారికి సమాజం ఎల్లప్పుడు గౌరవిస్తుంది ఉపాధ్యాయుని గుండెల్లో గుడి కట్టి మనసారా ధ్యానించి సమాజం నేడు దర్శనమిస్తుంది ఉపాధ్యాయుని ప్రవర్తన తరగతిగదిపై ప్రభావం చూపుతుంది. ఉపాధ్యాయుడు భవిష్యత్ తరానికి వారధి కావాలి సామాజిక మార్పు విద్యను అందించే ఉపాధ్యాయుడు కావాలి ఉపాధ్యాయుని ఏ దేశ ప్రగతి అయినా ఆ దేశ ఉపాధ్యాయుని సామర్థ్యంపై ఆధారపడి ఉంటుందని మనందరికీ తెలిసిన విషయమే. అటువంటి ఉపాధ్యాయులు విలువలతో కూడిన విద్యను అందించాల్సిన అవసరం నేడు అత్యవసరమైనది. ఉపాధ్యాయుడు ఆ విలువలను కలిగి ఉండాలి తన వృత్తికి వన్నెతెచ్చిన వాడై ఉండాలి. ఉపాధ్యాయ పని మేధాసంపత్తికి సంబంధించిన కృత్యాలతో కూడుకున్నదై ఉండాలి వృత్తుల అన్నింటిలో ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైన అని చెప్పవచ్చు. ఉపాధ్యాయుని నైపుణ్యం వ్యక్తిగత ప్రతిభ సౌశీల్యం నడవడిక విద్యార్థులను మానవతా మూర్తిగా తీర్చిదిద్దడంలో ప్రభావాన్ని చూపుతాయి. ఉపాధ్యాయుడు నిరంతర అభ్యాసకుడు అయితే తప్ప బోధించలేడు. ఒక దీపం తను నిరంతరం వెలుగుతుంటే తప్ప ఇతర దీపాలను వెలిగించ లేదు. విద్యా లక్ష్యాల సాధనలో కేంద్రబిందువు ఉపాధ్యాయుడు మాత్రమే విద్యా లక్ష్యాల సాధన పైనే దేశ అభివృద్ధి ఆధారపడి ఉంది. విద్యా ప్రమాణాలు పూర్తిగా ఉపాధ్యాయుని శక్తి సామర్థ్యం ఆధారపడి ఉంటాయి మానవ సమాజాన్ని సన్మార్గంలో నడిపించ గల యోధుడు ఉపాధ్యాయుడు మాత్రమే ప్రస్తుత కాలంలో విద్య ఒక వ్యాపార సంస్థగా మారింది గురువుకు ఇవ్వాల్సిన స్థానం లభించడం లేదు సమాజం కూడా గురువులకు సముచిత స్థానం ఇవ్వడం లేదు. విద్య విద్యార్థులకు సంపూర్ణ వికాసానికి తోడ్పడే విధంగా కృషి విద్యార్థులకు ఉపాధ్యాయులకు ఉండాలి. అప్పుడే విద్యను నేర్పే గురువుకు సమాజంలో సముచిత స్థానం లభిస్తుంది. అమ్మ జన్మనిస్తుంది నాన్న జీవితాన్ని ఇస్తాడు జీవితానికి ఒక అర్థాన్ని పరమార్థాన్ని భవిష్యత్తును అందించేది మాత్రం ఉపాధ్యాయుడే విద్య నేర్చిన ప్రతి వ్యక్తి విజయం వెనుక కచ్చితంగా ఉండేది ఉపాధ్యాయులే విద్యా వ్యవస్థకు ఉపాధ్యాయులే మూలస్తంభాలు పుస్తకాలు విద్యాలయాలు పరికరాలు ఎన్ని ఉన్నా విద్యా మందిరంలో గురువు పాత్ర విశిష్టమైనది మహోన్నతమైనది. మొక్కలకు నీరు పోసి పెంచి తోటమాలిలా గురువు విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయాలి. విద్యార్థులకు ఆసక్తికరంగా సమయస్ఫూర్తితో బోధించగలగాలి అప్పుడే ఉపాధ్యాయునికి ఉపాధ్యాయ వృత్తికి గౌరవప్రదం.

(ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా..)

-ఎం ఎన్ విజయ కుమార్ ,
9441089035

పుస్తక సమీక్ష

# ఆధ్యాత్మిక, సామాజిక, చారిత్రక అంశాల "మన బంగారు బతుకమ్మ"




తెలంగాణ సాంస్కృతిక, సంప్రదాయానికి ప్రకృతితో ప్రత్యక్ష అనుబంధం కలిగిన బతుకమ్మ, తెలంగాణ మగువలు ఆరాధించే, ఆనందోత్సాహాల వేడుకగా జరుపుకొనే పూలపండుగ. అన్ని కులాల, వర్గాలు కలిసి మెలసి అందమైన సమాజంగా తీర్చిదిద్దుకోవాలనే సందేశం అందించే ఈ పండగను ఆడపడుచుల సంప్రదాయ ఆధ్యాత్మిక సంబురంగా, ప్రకృతితో మమేకమై ఆటపాటలతో జరుపుకొంటారు. నేటితరం నగరాలలోని మహిళలు కూడా ఆధునికతను జోడిస్తూ బతుకమ్మ ఆట పాటలతో ఆడిపాడి, నిమజ్జనం చేస్తున్నారు. కాకతీయుల కాలంలో ఆవిర్భవించిన ఈ పండుగ విశిష్టతను వివరించే, సరిగాద శంకర్ రచించిన 'మన బంగారు బతుకమ్మ' పుస్తకంలో ఆధ్యాత్మిక, సామాజిక, చారిత్రక అంశాలు పొందుపరిచారు. ముఖ్యంగా భక్తిపూర్వక భావనలకు, గ్రామ దేవతా రూపాల ఆరాధనకు నిదర్శనాలైన పాటలు, ఆ తల్లి పుట్టు పూర్వోత్తరాల కథనాలను ప్రస్ఫుటం చేసే 60 పాటలుగా శంకర్ గ్రంథస్థం చేసారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయులు, సుర్యశ్రీ పేరిట రచయిత, అయిన సిరిగాద శంకర్ సాహితీకృషి అత్యంత ప్రశంసనీయమైంది. బతుకమ్మ పండుగ మూలాలు, సందేశం, ప్రాముఖ్యత, ఆవిర్భావ కథలు, పాటల పరమార్థం, రచయిత శంకర్ తొలి 12 పేజీలలో సంపూర్ణంగా పరిచయం అందించారు. సంక్షిప్తంగా మూడు కథాంశాలు ఆసక్తికరంగా వివరించారు. ఎంగిలిపూల బతుకమ్మ పాటలో ఏడుగురితో పుట్టిన అక్కమ్మ, తల్లిదండ్రులకు, ఏడుగురు అన్నదమ్ములకు, ఏడుగురు వదినెలకు, చేసుకొన్న పురుషునికి తన జీవన కథనాన్ని పుట్టింటి వారికి తెలియచేయమని పాడే ఉయ్యాల పాట, అదే విధంగా బంగారు బతుకమ్మ అత్తవారింట పెద్దన్న వచ్చినపుడు కాళ్లకు నీళ్లిచ్చి, కన్నీళ్ళు నింపటం పాట అంతరార్థాలు ఆడపడుచుల పుట్టింటి, అత్తింటి ప్రాచీన సామాజిక జీవన నేపథ్యానికి వాక్చిత్రాలుగా అద్దం పడుతున్నాయి. భాద్రపద అమావాస్య నుంచి మహర్నవమి కొరకు, తొమ్మిది రోజులు నిర్వహించే బతుకమ్మ పండుగలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయ విలువలను భావితరాలకు ప్రదర్శింపచేసే జానపద కథా సాహిత్యం ఎంతో నిక్షిప్తమైవుంది. రచయిత సిరిగాద శంకర్ రచించిన గాంధారి బాలరాజు ఉయ్యాల పాటను ఈ పుస్తకంలో పొందుపరచటం, ఉయ్యాలపాటల రచయిత ప్రతిభా సంపన్నతను ప్రశంసింపచేస్తోంది. సిరిగాద శంకర్‌గారి కృషి సదా అభినందనీయం.

ప్రతులకు: సిరిగాద శంకర్
4-94/ఎ, కాకతీయనగర్ కాలనీ
కామారెడ్డి (మం॥జిల్లా)-503 111
సెల్: 9493301985

-జయసూర్య
సెల్: 9440664610

## తాత చెప్పులు!



డొప్పల్లా వంగి
దిగాలున ఆ మూలన కనబడుతున్నాయే..
అవే.. మా తాత చెప్పులు!
అన్నివేళలా..
ఆయనకు బాటను చూపి
బాసటగా నిలిచాయి!
ఆయన పాద ధూళినే..
సుగంధ పరిమళంగా అద్దుకున్న
ఘనత వాటికుంది!
ముళ్ళను.. పుష్పాలను
ఎండను.. వానను స్పర్శించడంలో..
సమభావాన్ని చూపి తమ
స్థిత ప్రజ్ఞతను చాటుకున్నాయి!
ఎన్నో ఏళ్ళు..
తాతతో సహవాసం చేసిన ఇవి
ఆయన మధుర స్మృతులకు
సాక్షీభూతంగా నిలిచాయి!
ఆయన
కచేరీలో కొలువుదీరేవేళ
ఇంట్లో సేద తీరే సమయాన..
బయట ఉండి
ఓపిగ్గా కాపలా కాసాయి!
అసలు సిసలైన తోలుతో
రూపుదిద్దుకున్నామన్న గర్వం కాబోలు
రోడ్డుపై 'కిర్రు' 'కిర్రు'మంటూ
అందరి దృష్టినాకర్షించేవి!
తాత ఇప్పుడు లేకపోయినా
పచ్చబొట్టులా..
అచ్చయి వున్న ఆయన పాదముద్రలు
ఈ చెప్పుల్లో.. ఇప్పటికీ
భద్రంగా వున్నాయి!

- దాస్యం సేనాధిపతి
సెల్: 94405 25544



# స్వ. పాతూరి మాణిక్యమ్మ స్మారకజాతీయ స్థాయి సాహిత్య పురస్కారం

మా అమ్మగారైన శ్రీమతి పాతూరి మాణిక్యమ్మ స్మారక సాహిత్య పురస్కారం-2021 కోసం వచన కవితా సంపుటులను ఆహ్వానిస్తున్నాము. 2020 సంవత్సరంలో ప్రచురింపబడిన వచన కవితా సంపుటులను మాత్రమే ఈ పోటీకి పంపవలెను.
ఎంపిక ఐన ఉత్తమ కవితా సంపుటికి 5000 రూ.నగదు బహుమతి అందించబడును.
పరిశీలనా నిమిత్తం రెండు కవితా సంపుటులను 15-9-21 లోగా ఈ చిరునామాకి పంపవలెను.

డా.పాతూరి అన్నపూర్ణ ,
1156/28-1,
ప్రశాంతి నగర్,
నవలాకుల గార్డెన్స్, నెల్లూరు-524002,
సెల్:9490230939,9701401173

## కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న
అడ్మిన్: రమాదేవి కులకర్ణి

### 'బుధవారం బాద్షా' పోటీ ఫలితాలు

ఈ సమూహంలో చేరదలచినవారు 8985613123కి మెసేజ్ చేయవచ్చు.
నిర్వహణ: డా॥ప్రతికంఠం మాలతీలత

ప్రథమ బహుమతి విజేత

### శ్రావణసంధ్య

మట్టి పరిమళపు వాన
మేఘాల మాటున అజ్ఞాతవాసినే.
చిట్టి గులాబీల వేరు
మట్టి మాటున అజ్ఞాతవాసినే.
తట్టి లేపిన ప్రేరణా
గుండె గుడిలో అజ్ఞాతవాసినే.
గుప్త దానాల దయ
మనసు చాటున అజ్ఞాతవాసినే.
స్పందన ఇచ్చిన భావం
అక్షరం మాటున అజ్ఞాతవాసినే.
కనిపించని గుండె ధైర్యం
కష్టాల మాటున అజ్ఞాతవాసినే.
అనుభూతినిచ్చే ప్రతి జ్ఞాపకం
గడిచే కాలం చాటున అజ్ఞాతవాసినే.
చైతన్యం నిండిన జీవితం చాటున
వెంటాడే మరణం అజ్ఞాతవాసినే.
వెలుగుకి చీకటి
గెలుపుకి ఓటమి
మనసుకి మరుపు
ఎప్పుడూ అజ్ఞాతమే.
గోచరమయ్యే ప్రతి విధి వెనుక
ఎన్నెన్నో అజ్ఞాతభావ పరంపరలో
జరిగే దాకా తెలియని నిగూఢ రహస్యాలో

ద్వితీయ బహుమతి విజేత

### అజ్ఞాతం

మానవులమైన మనందరం
నిజానికి అజ్ఞాతంలోనే అనేక
సంవత్సరాలుగా జీవిస్తున్నాం.
అజ్ఞాతం అంటే కనబడకపోవడం నిజానికి మనలో చాలామందికి కనబడవు ఎదుటి వారి కష్టాలు, నష్టాలుచూసినా చూడనట్టు పోయే మన మనస్తత్వాలు.... మనకెందుకులే అనే స్వార్థపూరిత జీవన విధానాలు.
అనంతమైన వెలుగుల్లో మనం బ్రతికేస్తూ ఉన్నా అంతరాత్మ దృష్టిలో ఎంతో అజ్ఞాతంలో బ్రతుకీడుస్తున్నం...అజ్ఞాతంలో, ఎందుకంటే మనకున్న ఎన్నో సౌలబ్యాలలో కొన్నిటిని వదులుకున్న ఎంతో మందికి మేలు చేసేవారుగా మనము ఉంటాము..
కానీ మనము అలా ఉండలేము ఎందుకంటే ఎవరు ఎలా ఉంటే మనకేంటి మనం మాత్రం బాగుంటే చాలు అనుకునే నాసిరకపు మనుషులం.... ఇదే నిజానికి మనలో ఉన్న అజ్ఞానపు అజ్ఞాతం.
పక్కనోడు బాగుపడితే చూడలేము కానీ,,, జెండా పండగరోజు మాత్రం జనగణమన అధి నాయక జయహే అని గొంతు ఎత్తి పాట పాడి దేశభక్తిని చాటుకు ఉంటున్నాం.
మనలో అజ్ఞానపు ఆలోచనలకి స్వస్తి పలికి విజ్ఞానపు ఆలోచనలు చేసి,, అజ్ఞాతంమై మనలో ఉన్న నాసిరకపు మనస్తత్వాన్ని తరిమేద్దాం....విజ్ఞానపు వెలుగులతో నవ భారత నిర్మాణానికి నడుం బిగిద్దాము.

-మహేందర్ వర్మ
9866311991

# ఫీచర సునీతా రావు అవార్డుల విజేతలు

నూటెంకి రవీందర్ | దేవన పల్లి వీణావాణి | కే.వి. నరేందర్ | ఎం.వి. రాంరెడ్డి | రూపుకుమార్ డబ్బీకార్ | విహారి

గతంలో పీ. విజేందర్ రావు ఆయన సతీమణి కీ.శే. ఫీచర సునీతా రావుకి నివాళిగా ప్రతి అంశానికి రూ॥పదిహేను వేలు (15,000/-) ప్రకటించిన విషయం తెలిసిందే . వరుసగా కవిత్వం ,కథ ,విమర్శలకు ప్రతి అంశానికి న్యాయనిర్ణేతలు ఇద్దరిద్దరు విజేతలను ఎంపిక చేశారు. కవిత్వానికి **నూటెంకి రవీందర్** (అతడు అలిగితే కవితా సంపుటి), **దేవన పల్లి వీణావాణి,** (శిలాఫలకం కవితా సంపుటి. కథలకు **కే.వి. నరేందర్** (కథమానంభవతి), **ఎం.వి. రాంరెడ్డి** (వెంటవచ్చునది). అట్లాగే విమర్శకు **విహారి** (వివధ), **రూపుకుమార్ డబ్బీకార్** (అంతర్హితం) ఎంపికయ్యారు.

పై అంశాల పరిశీలనకు న్యాయనిర్ణేతలుగా ఏనుగు నరసింహారెడ్డి కవిత్వానికి, ఆడెపు లక్ష్మిపతి కథలకు , అలాగే గుడిపాటి విమర్శకు వ్యవహరించారు. త్వరలో రవీంద్ర భారతిలో జరిగే సభలో విజేతలకు ఈ అవార్డులు ఒక్కొక్కరికి రూ. ఏడువేల ఐదు వందలు (7,500) అందజేయబడుతాయి.

- **డాక్టర్ .కాంచనపల్లి గోరా.**
కన్వీనర్ ,ఫీచర సునీత అవార్డ్ కమిటీ.




ఆగష్టు 26న శ్రీ త్యాగరాయ గానసభ కళాసుబ్బారావు కళావేదికపై నిర్వహించిన దేవులపల్లి రామానుజారావు జయంతి సభలో పాల్గొన్న లతావర్మ, భమిడి ఉష, పొత్తూరి సుబ్బారావు, దేవీప్రసాద్, గుదిబండి వెంకటరెడ్డి, దేవులపల్లి ప్రభాకరరావు, కళా వి.ఎస్.జనార్ధమూర్తి.




బొజ్జా ఫౌండేషన్ స్థాపించి 25 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంలో ఇరు రాష్ట్రాలలో సేవా రంగంలోని వ్యక్తులను గుర్తించి వారిని సన్మానించి జాతీయ విశిష్ట సేవా జ్యోతి, జాతీయ విశిష్ట కళా జ్యోతి అవార్డ్స్ మరియు మేమెంటోలతోసత్కరించారు. వేడుకలు హైదరాబాద్ రవీంద్ర భారతి లో జరిగా యి. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్, పశ్చిమ గోదావరి జిల్లాలోని తాడేపల్లి గూడెం కు చెందిన బొల్లాప్రగడ ఉదయ భాను సాహిత్యం లో చేస్తున్న కృషిని ప్రశంసిస్తూ నేషనల్ విశిష్ట సేవా జ్యోతి అవార్డ్ మరియూ మెమెంటో తో సత్కరిస్తున్న దృశ్యం.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.